
ఆధిపత్య రహిత సమాజాన్ని నిర్మిద్దాం

సీఎం స్టాలిన్ ● చెన్నై, కోవైలలో మోడల్ హాస్టళ్ల ఏర్పాటు

అడయార్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆధిపత్య రహిత సమాజాన్ని నిర్మిద్దామని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పిలుపునిచ్చారు. స్థానిక కోట్టూరుపురంలోని అన్నా సెంటనరీ గ్రంథాలయంలో శనివారం పలు కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో ముఖ్యమంత్రి స్టాలిన్ పాల్గొని విద్యార్థులకు అనేక సంక్షేమ సహాయాలను పంపిణీ చేశారు. విద్యార్థులకు ప్రయోజనం చేకూరేలా అనేక కొత్త పథకాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ... ప్రతి ఒక్కరికీ అన్నింటినీ సమానంగా అందించే సమాజం ఏర్పాటు కావాలన్నదే మన లక్ష్యమన్నారు. అధికారం అనేది మన లక్ష్యాలను చేరుకునేందుకు ఒక మార్గమన్నారు. అందుకే డీఎంకే ప్రభుత్వం ఏర్పడినపుడల్లా సంక్షేమ పథకాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి వాటిని అమలు చేస్తున్నామన్నారు. అవకాశాలు లేనివారికి వాటిని చేరువ చేస్తూ, వారు కూడా అన్ని సమాన అవకాశాలు పొందేలా డీఎంకే ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఒక సమాజం వృద్ధిపథంలోకి రావాలంటే విద్య ఎంతో ముఖ్యమన్నారు. అందుకే విద్యపై ప్రత్యేక దృష్టిసారించామన్నారు. ఆదిద్రావిడ సంక్షేమ శాఖ కింద ఉండే అన్ని పాఠశాలలు, వసతి గృహాల్లో మెరుగైన సౌకర్యాలను కల్పిస్తున్నామన్నారు. జాతీయస్థాయిలో జరిగే పోటీ పరీక్షలకు విద్యార్థులు సన్నద్ధమయ్యేలా ప్రత్యేక శిక్షణ కూడా ఇస్తున్నామన్నారు. అందుకే మన విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెరిగిందన్నారు. ఐఐటీ, ఎన్ఐటీ వంటి జాతీయ స్థాయి సంస్థల్లో 2024-25 విద్యా సంవత్సరంలో 135 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారని ఆయన గుర్తు చేశారు. విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు వీలుగా రూ.44.50 కోట్ల వ్యయంతో ఎస్సీ, ఎస్టీ వసతి గృహాల్లో వసతులను కల్పిస్తున్నామన్నారు. చెన్నై, కోయంబత్తూరుతో సహా ఆరు ప్రాంతాల్లో జిమ్ సౌకర్యంతో కూడిన హాస్టల్స్‌ను రూ.60 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నట్టు చెప్పారు. హాస్టల్ విద్యార్థుల కోసం రూ.36.33 కోట్ల వ్యయంతో 77 లెర్నింగ్ సెంటర్స్‌ను నిర్మించామన్నారు. వసతి గృహాల్లో భద్రత కోసం సీసీటీవీ కెమెరాలతో పాటు బయోమెట్రిక్ సిస్టమ్‌ను రూ.27.15 కోట్ల వ్యయంతో 1383 హాస్టల్స్‌లో ఏర్పాటు చేశామన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల కోసం అనేక సంక్షేమ పథకాలను ఒక్క డీఎంకే ప్రభుత్వ హయాంలోనే చేపట్టామన్నారు. విద్యార్థులు పరిశోధనాత్మక విద్యను అభ్యసించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రపంచంలోని అగ్రశ్రేణి వర్సిటీల్లో ప్రవేశాలు పొందేలా తీర్చిదిద్దేందుకు అంబేడ్కర్ ఉన్నత విద్యా పథకాన్ని ప్రవేశపెట్టామన్నారు. న్యాయ విద్యార్థుల శిక్షణ కోసం రూ.1000 ఆర్థిక సాయం చేస్తున్నట్టు చెప్పారు. 9659 మంది విద్యార్థులకు రూ.90 కోట్ల వరకు ఆర్థిక సాయం అందజేశామన్నారు. డీఎంకే ప్రభుత్వ హయాంలో 385 మంది విద్యార్థులు ప్రపంచ అగ్రశ్రేణి వర్సిటీల్లో ప్రవేశాలు పొందారన్నారు. జీవితంలో ఎదురయ్యే అన్ని అడ్డంకులను ఛేదించి ప్రగతిపథంలో నడవాలని, ఆధిపత్య రహిత సమాజాన్ని నిర్మించి తీరడం తథ్యమని సీఎం స్టాలిన్ పునరుద్ఘాటించారు.



నూతన పథకాలను ప్రారంభిస్తున్న స్టాలిన్



శక్తివేల్‌కు నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ జి.హరి (ఇన్‌సెట్లో) జవాన్ ఫైల్‌ఫొటో

అమర జవాన్‌కు

కన్నీటి వీడ్కోలు

తిరుత్తణి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్ సరిహద్దుల్లో తీవ్రవాదుల తూటాలకు నేలకొరిగిన తిరువళ్లూరు జిల్లాకు చెందిన అమరజవాన్ శక్తివేల్‌కు నేతలు, అధికారులు, స్థానికులు కన్నీటి వీడ్కోలు పలికారు. తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సమీపంలోని సత్తురంజయపురానికి చెందిన శక్తివేల్ (30) జమ్మూ కశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో గురువారం ఉదయం 11 గంటలకు జరిగిన తీవ్రవాద కాల్పుల్లో మరణించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం శక్తివేల్ భౌతికకాయం స్వస్థలానికి చేరుకుంది. దీంతో కుటుంబీకులు, గ్రామస్తులు శక్తివేల్‌ను స్మరించుకుంటూ కన్నీటిపర్యంతమయ్యారు. అదేవిధంగా అరక్కోణం మాజీ ఎంపీ జి.హరి కూడా శక్తివేల్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శక్తివేల్ తండ్రి, భార్య, పిల్లల్ని పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత సైనికుడిగా తన కర్తవ్యాన్ని నిర్వర్తించి అమరుడైన శక్తివేల్ త్యాగం మరువలేనిదన్నారు.

సమస్యంతా

● హిందూముస్లింలమంతా కలిసిమెలసే ఉన్నాం

● తిరుప్పరంకుండ్రం ప్రజల మనోగతం

బయటి వారి నుంచే!

చెన్నై, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లా తిరుప్పరంకుండ్రం గత కొంతకాలంగా వేడెక్కిపోతోంది. ఒకే కొండపై సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయం, హజ్రత్ సుల్తాన్ దర్గా ఉండడంతో అక్కడ జరిగే పూజాది కార్యక్రమాల వ్యవహారంతో రేగిన వివాదం చిలికిచిలికి గాలీవానగా మారుతోంది. అక్కడి కొండపై వెలసిన సుబ్రమణ్యేశ్వరుడి దీపస్తంభంపై కార్తీక మాసం రోజున దీపం వెలిగించే వ్యవహారంపై వివాదం రాజుకుంటోంది. అక్కడ దీపం వెలిగించాల్సిందేనని కొంతమంది భక్తులు పట్టుబడుతుండగా, అదే స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం కూడా అవాంతరాలు కలిగిస్తోంది. ఈ పట్టువిడుపుల్లో ఏది నిజమో, ఏది అబద్ధమో, ఎవరిది సత్యమో, ఎవరిది కల్పితమో అర్థంగాక బయటి ప్రజలు గందరగోళానికి గురవుతున్నారు. అక్కడ దీపస్తంభంపై దీపం వెలిగించడంలో ఎందుకంత పట్టుదల అని కొందరు ప్రశ్నిస్తుండగా, భక్తుల మనోభావాలకు అనుగుణంగా నడచుకోవాల్సిన ప్రభుత్వం దీపం వెలిగించే విషయంలో ఎందుకు పట్టుదలకు పోతోందని మరికొంతమంది నిలదీస్తున్నారు. ఈ వ్యవహారం మొత్తం ఇప్పుడు రాష్ట్ర హైకోర్టు నుంచి దేశ సర్వోన్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టుకు చేరింది. ఈ వ్యవహారంపై ఎలాంటి తీర్పు వస్తుందోనన్న ఉత్కంఠ నెలకొంది. ఇంతటి వివాదం నేపథ్యంలో ఇంతకీ అక్కడున్న హిందూ, ముస్లింలు ఏమనుకుంటున్నారో, వారి మనోగతమేంటో తెలుసుకునేందుకు ఓ ఆంగ్లమీడియా సంస్థ, ఓ తమిళ మీడియా సంస్థ ప్రయత్నించాయి. తిరుప్పరంకుండ్రంలో లోతుగా పరిశీలన జరిపి, స్థానికుల మనోగతాన్ని బహిర్గతం చేశాయి. ఆ వివరాలు పరికిద్దాం..!

బయటి వ్యక్తులు సృష్టించిన సమస్యే!

దీపస్తంభంపై దీపం వెలిగించే వ్యవహారం హిందూ, ముస్లింల మధ్య సమస్యగా చూసేందుకు స్థానికులు నిరాకరించారు. ఇది కేవలం బయటి వ్యక్తులు సృష్టించిన సమస్యే తప్ప, దీనితో స్థానికులకు ఎలాంటి సంబంధం లేదని వారు నిర్ద్వంద్వంగా స్పష్టం చేశారు. తాము పరస్పరం మత విశ్వాసాలను గౌరవించుకుంటూ కలసిమెలసి జీవిస్తున్నామని, తమకు అనవసరంగా వివాదం చుట్టేందుకు బయటివ్యక్తులు ప్రయత్నిస్తున్నారని అత్యధికులు వాపోయారు. గత జూలైలో సుబ్రమణ్యస్వామి ఆలయంలో కుంభాభిషేకం జరిగితే హజ్రత్ సుల్తాన్ సికిందర్ పాదుషా దర్గా సభ్యులు హిందూ భక్తులకు తాగునీరు, ఆహారాన్ని అందించేందుకు



మసీదు తలుపులు తెరిచారని పలువురు గుర్తు చేశారు. ఇప్పటి వరకు పండుగ సంతోషాలను పరస్పరం పంచుకున్నామని వివరించారు. దర్గా కార్యదర్శి ఎం.ఆరిఫ్‌ఖాన్ మాట్లాడుతూ.. 'పండుగల సమయాల్లో హిందువులు ఈద్గాలకు వస్తారు, ముస్లింలు ఆలయాలకు వెళ్తారు. వారి పండుగలప్పుడు మాకు పిండివంటలు, మా పండుగలప్పుడు వారికి పిండివంటలు ఇవ్వడం నా చిన్నప్పటి నుంచి సంప్రదాయంగా వస్తోంది' అని వ్యాఖ్యానించారు. బయటి వ్యక్తులు తమ మధ్య ఘర్షణ బీజాలు నాటేందుకు ప్రయత్నిస్తున్నారని, కానీ స్థానికులు అందుకు సిద్ధంగా లేరని ఆయన స్పష్టం చేశారు.

మతఘర్షణల దాఖలాలే లేవు!

శరవణన్ అనే వ్యక్తి మాట్లాడుతూ.. ఇక్కడ హిందువులు, ముస్లింలు, జైనులు అధికంగా ఉన్నారని, కానీ ఏనాడూ మతాలవారీగా ఘర్షణలు జరిగిన దాఖలాలే లేవని వివరించారు. బయటి వ్యక్తులు వచ్చి సమస్యలు సృష్టించేందుకు ప్రయత్నం చేస్తుంటారని, ఈ సంవత్సరం అది కొంచెం పెరిగిందని వివరించారు. కానీ తామెవ్వరమూ ఆ ప్రయత్నాలకు, ఆ ప్రలోభాలకు గురి కాలేదని భావోద్వేగంతో చెప్పారు. ఆలయ సమీపంలో దుకాణాలు నడుపుతున్న జయరాజ్, కార్తీక్, ఆనంద్ మాట్లాడుతూ.. కార్తీకదీపోత్సవాల సందర్భంగా ముస్లిం సోదరులకు తాము స్వీట్లు పంచామని, వారు కూడా తమకు స్వీట్లు ఇచ్చారని గుర్తు చేశారు. తాము క్రిస్మస్ సమయంలో కూడా పటాసులు పేల్చి మిఠాయిలు పంచుకుంటామని వివరించారు. ఆలయం సమీపంలో నివశిస్తున్న మహమ్మద్ అనే వ్యక్తి మాట్లాడుతూ.. తమ మధ్య ఎప్పుడూ మతపరమైన విద్వేషం, శత్రుత్వం లేదని, తాము ఏనాడూ మతాలపరంగా కేసుల వరకూ వెళ్లలేదని వివరించారు. సర్వమత శాంతియుత సహజీవనానికి తిరుప్పరంకుండ్రం అద్భుతమైన ఉదాహరణ అని ముతుక్ అనే వ్యక్తి వ్యాఖ్యానించారు.

ఆందోళనా ఉంది

బయటివ్యక్తులు తిరుప్పరంకుండ్రం గురించి చేస్తున్న ప్రకటనలు, వివాదాస్పద వ్యాఖ్యలను మీడియాలో చూసి తాము నవ్వుకుంటుంటామని, కానీ ఈ వ్యవహారం ఎప్పుడైనా స్థానికుల మధ్య చిచ్చురేపుతుందేమోనన్న భయమూ ఉందని దినకరన్, సాదిక్ అనే స్నేహితులు ఆందోళన వ్యక్తం చేశారు. మూడు దశాబ్దాలుగా తిరుప్పరంకుండ్రంలో జీవిస్తున్న సామాజిక కార్యకర్త, రచయిత కృష్ణన్ మాట్లాడుతూ.. తమ ప్రాంతంలో హిందూ, ముస్లిం, జైనులు శాంతియుతంగా కలసిమెలసి జీవిస్తున్నారని తెలిపారు. ఇటీవలి కాలంలో కొంతమంది బయటి వ్యక్తులు మతపరమైన ఘర్షణలు సృష్టించి, వాటి నుంచి లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నారని, కానీ వారు 'బయటి' వ్యక్తులే అన్న విషయం తమకు బాగా తెలుసని వ్యాఖ్యానించారు. కొంతమంది మహిళా భక్తులు మాట్లాడుతూ.. మూడు రోజుల క్రితం పోలీసుల సంచారం పెరిగినప్పటికీ ఆలయంలో తాము సాధారణంగా ప్రార్థనలు కొనసాగించామని తెలిపారు. బారికేడ్లు వున్నప్పటికీ, నివాసితులు తమ వాహనాలను చెక్‌పోస్టులు దాటి స్వేచ్ఛగా నడిపారని, తిరుప్పరంకుండ్రంపై జరిగిన వివాదంతో ప్రభావితం కాకుండా తాము యథావిధిగా తమ పనులు, వ్యాపారాలు చేసుకున్నామని వివరించారు.

అన్నాడీఎంకేను

బీజేపీ కబళించడం ఖాయం

డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్



సహాయాలు పంపిణీ చేస్తున్న ఉదయనిధి

అడయార్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకేను బీజేపీ కబళించడం ఖాయమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, డీఎంకే యువజన విభాగం అధ్యక్షుడు ఉదయనిధి పేర్కొన్నారు. ఆయన శనివారం విల్లుపురం జిల్లా సెంజిలో జరిగిన పార్టీ కార్యక్రమంలో, చెన్నైలో ప్రభుత్వ సహాయాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఉదయనిధి మాట్లాడుతూ.. దేశం యావత్తూ తిరిగి చూసేలా ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సుపరిపాలన సాగిస్తూ, రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్నారన్నారు. రాష్ట్ర హక్కులను హరించేందుకు బీజేపీ శతవిధాలా ప్రయత్నిస్తోందన్నారు. ఈ ఒక్క పని తప్ప, ఆ పార్టీ రాష్ట్ర నేతలు మరేమీ చేయడం లేదన్నారు. ముఖ్యంగా ఓటర్ల జాబితాలో ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను తీసుకొచ్చిందని, దీనికి వ్యతిరేకంగా తమ పార్టీ న్యాయ పోరాటం సాగిస్తుందన్నారు. ఇప్పటికే అన్నాడీఎంకే కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేతుల్లోకి వెళ్లిందని ఆరోపించారు. అందుకే రాష్ట్రానికి వ్యతిరేకంగా బీజేపీ ఎన్ని నిర్ణయాలు తీసుకున్నప్పటికీ అన్నాడీఎంకే నేతలు వంతపాడుతున్నారని విమర్శించారు. తమతో చెలిమి చేసే పార్టీలను అంతం చేసి ఆ స్థానాన్ని ఆక్రమించడమే బీజేపీ లక్ష్యమని, ఇందులో భాగంగా త్వరలోనే అన్నాడీఎంకేను కబళించడం ఖాయమని వ్యాఖ్యానించారు. రానున్న నాలుగు నెలలు ఎంతో కఠినమైన సవాలుతో కూడినవని, ఇంటింటి ప్రచారం చేస్తూ, ప్రతి ఓటరును కలుసుకుంటూ, ముఖ్యమంత్రి స్టాలిన్ నాయకత్వంపై ప్రజలకు మరింత విశ్వాసం కలిగేలా చర్యలు చేపట్టాలని కార్యకర్తలను కోరారు.

10వేల మందికి 19న ఉచిత ట్యాబ్‌ల పంపిణీ

అడయార్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గత 2025-26 వార్షిక బడ్జెట్‌లో పేర్కొన్నట్టుగా ఆర్ట్స్, సైన్స్, ఇంజనీరింగ్, వైద్యం, అగ్రికల్చర్ వంటి అన్ని ఉన్నత విద్యకు చెందిన విద్యార్థులు లబ్ధి పొందేలా ఉచితంగా ల్యాప్‌టాప్, ట్యాబ్‌లను రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేయనుంది. ఇందులో భాగంగా ఈ నెల 19వ తేదీన 10 లక్షల మంది విద్యార్థులకు ఉచిత ట్యాబ్ లేదా ల్యాప్‌టాప్‌లను అందజేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రారంభించనున్నారు. నందంబాక్కంలోని చెన్నై ట్రేడ్ సెంటరులో ఈ కార్యక్రమం కోసం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన ఎల్‌కాట్ సంస్థ హెచ్‌పీ, ఏసర్, డెల్‌వంటి అగ్రశ్రేణి సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుంది. ఒక్కో ట్యాబ్‌ను ప్రభుత్వం రూ.21,650కి కొనుగోలుచేసి అర్హులైన విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేయనుంది. 14 లేదా 15.6 అంగుళాల స్క్రీన్, 8 జీబీ ర్యామ్, 256 ఎస్ఎస్‌డీ హార్డ్‌డిస్క్, విండోస్ 11, బ్లూటూత్ 5.0 వెర్షన్, 720 పిక్సెల్ హెచ్‌డీ కెమెరా ఇలాంటి ఫీచర్లతోకూడిన ట్యాబ్‌లను ప్రభుత్వం అందించనుంది.



లోక్‌భవన్‌లో గవర్నర్ ఆర్ఎన్ రవి, కోట్టూరుపురం అన్నా సెంటినరీ లైబ్రరీలో సీఎం ఎంకే స్టాలిన్, స్వగృహంలో టీవీకే అధ్యక్షుడు విజయ్, హార్బర్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ నివాళులు

అంబేడ్కర్‌కు నేతల ఘన నివాళి

ప్యారీస్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత, 'భారతరత్న' గ్రహీత భీమ్‌రావ్ రామ్‌జీ అంబేడ్కర్ 69వ వర్ధంతి సందర్భంగా శనివారం రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, వివిధ రాజకీయ పార్టీల నేతలు, ప్రముఖులు ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలదండలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. స్థానిక గిండిలోని లోక్‌భవన్‌లో అంబేడ్కర్ విగ్రహం ముందు ఏర్పాటు చేసిన ఆయన చిత్ర పటానికి గవర్నర్ ఆర్ఎన్ రవి పూలు చల్లి నివాళులు అర్పించారు. ముఖ్యమంత్రి స్టాలిన్ స్థానిక కోట్టూరుపురంలోని అన్నా సెంటినరీ లైబ్రరీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన డా.అంబేడ్కర్ చిత్రపటానికి పూలు చల్లి నివాళులు అర్పించారు. స్థానిక రాయపేటలోని సత్యమూర్తిభవన్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు సెల్వపెరుంతగై, మాజీ అధ్యక్షుడు తిరునావుక్కరసర్, తంగబాలు తదితరులు పూలు చల్లి నివాళులర్పించారు. తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ పనయూర్‌లోని తన నివాసంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలు చల్లి అంజలి ఘటించారు. కోయంబేడులోని డీఎండీకే కార్యాలయంలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రేమలత పార్టీ శ్రేణులతో కలిసి బాబాసాహెబ్ చిత్రపటానికి పూలు చల్లి నివాళి అర్పించారు. హార్బర్ ప్రాంతంలో నిర్వహించిన అంబేడ్కర్ జ్యోతి ర్యాలీలో బీజేపీ రాష్ట్రఅధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, రాష్ట్ర సర్వసభ్య మండలి సభ్యుడు, జీసీసీ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ గిరినాథ్, కరునాగరాజన్ తదితరులు పాల్గొన్నారు. వారు అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకుని నివాళులర్పించారు. అలాగే తమిళ మానిల కాంగ్రెస్ అధ్యక్షుడు, కేంద్ర మాజీమంత్రి జీకే.వాసన్ ప్రధాన కార్యదర్శులు జీఆర్.వెంకటేష్, జవహర్ బాబు, ఈకే. అరుణ్‌కుమార్, బిజుచాకో తదితరులు అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. డీపీఐ, పీఎంకే, వివిధ దళిత సంఘాలు, రాజకీయ పార్టీలు భారతరత్న డా. బాబాసాహెబ్ అంబేడ్కర్‌కు ఘనంగా పుష్పాంజలి ఘటించారు.



కోయంబేడు డీఎండీకే కార్యాలయంలో ప్రేమలత విజయకాంత్- హార్బర్‌లో టీఎంసీ అధ్యక్షుడు జీకే వాసన్ తదితరుల నివాళులు

బ్లాక్ డే సందర్భంగా

రాష్ట్రవ్యాప్తంగా ముస్లిం సంఘాల నిరసనలు

● లక్ష మంది పోలీసులతో భద్రత

పెరంబూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బాబ్రీ మసీదు కూల్చివేత దినమైన డిసెంబరు 6ను 'బ్లాక్ డే'గా పాటిస్తూ కొన్ని ముస్లిం సంస్థలు శనివారం రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపట్టాయి. అదేవిధంగా తిరునల్వేలి కార్పొరేషన్ పరిధిలోని మేలపాళయంలోని రౌండ్ ఠానా, అన్నా వీధి, అంబై వీధి, వీఎస్‌టీ జంక్షన్, బజార్ వీధి, మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో టీ దుకాణాలు, దుకాణాలు, హోటళ్లు కలిపి 1,500 దుకాణాలను మూసివేశారు. అలాగే, ఆటోలు, వ్యాన్‌లు నడపవలేదు. కానీ,ప్రభుత్వ, ప్రైవేటు బస్సుసేవలు మాత్రం యథావిధిగా సాగాయి. మరోవైపు ఈ ఆందోళనల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు అవకాశం లేకుండా పోలీసులు పటిష్టమైన భద్రత కల్పించారు. ఇటీవలి కాలంలో బాంబు బెదిరింపులు పెరిగిన నేపథ్యంలో పోలీసులు.. విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్లు, ప్రధాన బస్టాండ్లు, లాడ్జీలు, హోటళ్లలో ముమ్మర తనిఖీలు చేపట్టారు. ముందస్తు జాగ్రత్తగా ప్రయాణికులు లగేజీని మెటల్ డిటెక్టర్ల ద్వారా తనిఖీలు చేసిన అనంతరం వారిని లోపలికి అనుమతించారు. అలాగే, ప్రధాన ప్రాంతాలు, మార్కెట్లు, ప్రజలు అధికంగా గుమిగూడే ప్రాంతాల్లో పోలీసులు గస్తీ పనులు చేపట్టారు.



రైలులో పోలీసుల తనిఖీలు - మేలపాళయంలో మూతపడిన దుకాణాలు

టీఎంఎంకే ఆధ్వర్యంలో అఖిలపక్ష పార్టీల ధర్నా

తమిళనాడు ముస్లిం మున్నేట్ర కళగం (టీఎంఎంకే) ఆధ్వర్యంలో నగరంలో శనివారం నిర్వహించిన ధర్నాలో అఖిలపక్ష పార్టీలకు చెందిన నేతలు పాల్గొన్నారు. వక్ఫ్ బోర్డు సవరణ చట్టం 2025ను ఉపసంహరించుకోవాలి, ప్రార్థనా స్థలాల (ప్రత్యేక నిబంధనలు) చట్టం 1991 పూర్తిగా అమలుచేయాలి, ఓటు హక్కు కాలరాసి ప్రజాస్వామ్యాన్ని మంటగలుపుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ నిలిపివేయాలి సహా పలు డిమాండ్లతో ఈ ధర్నా చేపట్టారు. కార్యక్రమానికి టీఎంఎంకే ప్రధాన కార్యదర్శి ఖాజా మైని నేతృత్వం వహించగా, తమిళనాడు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు సెల్వపెరుందగై, డీఎంకే శాసనసభ డిప్యూటీ కార్యదర్శి, ఎమ్మెల్యే పద్మనాభన్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.షణ్ముగం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎం.వీరపాండియన్, డీపీఐ తరఫున రజినీకాంత్ సహా టీఎంఎంకే నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ధర్నాలో అఖిలపక్ష నేతలు

సమాచార దర్శిని

12 వరకు మోస్తరు వర్షాలు

పెరంబూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈ నెల 12వ తేది వరకు మోస్తరు వర్షాలు కురిసే అవకాశముంది. ఈ మేరకు ప్రాంతీయ వాతావరణ పరిశోధన కేంద్రం విడుదల చేసిన ప్రకటనలో... దక్షిణ కేరళ, దానిని ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం కేంద్రీకృతమై ఉంది. ఈ కారణంగా, ఈ ఆదివారం నుంచి ఈ నెల 12వ తేది వరకు తమిళనాడు, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో ఒకటి, రెండు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముంది. రాజధాని నగరంలో చెన్నైలో రాబోయే 48 గంటల్లో ఆకాశం మేఘావృతంగా ఉంటూ కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షం కురిసే అవకాశముంది. పగటి ఉష్ణోగ్రతలు 30 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 24 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది.

పరీక్షలు రాయడంపై ప్రధాని నుంచి సలహాలు

పెరంబూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పరీక్షలు రాయడంపై ప్రధాని మోదీ సూచనలు, సలహాలు అందించే 'పరీక్షా పే చర్చా' కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు జనవరి 11వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవచ్చు. భయం, మానసిక ఒత్తిడి, ఆందోళనలు పోగొట్టి, పరీక్షలకు సన్నద్ధమయ్యేలా ప్రధాని మోదీ ఎనిమిదేళ్లుగా 'పరీక్షా పే చర్చా' కార్యక్రమం ద్వారా సూచనలు, సలహాలు అందజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు https://innovateindia.mygov.in అనే వెబ్‌సైట్‌లో జనవరి 11వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలి. అలాగే, 6వ తరగతి నుంచి ప్లస్ టూ చదివే విద్యార్థినీ, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తమ ప్రశ్నలు కూడా ఈ వెబ్‌సైట్ ద్వారా తెలపాలని అధికారులు తెలిపారు.

తాగునీటి ట్యాంకర్ల ధరల పెంపు

పెరంబూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అపార్ట్‌మెంట్లు, వాణిజ్య అవసరాల కోసం రిజర్వేషన్ చేసుకునే తాగునీటి ట్యాంకర్ల ధరలు పెరిగాయి. ఈ మేరకు చెన్నై మెట్రోవాటర్ బోర్డు విడుదల చేసిన ప్రకటనలో వివరాలు ఇలా ఉన్నాయి. చెన్నై కార్పొరేషన్ పరిధిలో కొళాయిల ద్వారా ప్రతిరోజు 106 కోట్ల లీటర్ల తాగునీటిని చెన్నై మెట్రోవాటర్ బోర్డు సరఫరా చేస్తోంది. అలాగే, అపార్ట్‌మెంట్లు, వాణిజ్య అవసరాల కోసం, ముందుగా రిజర్వేషన్ చేసుకుని తగిన రుసుము చెల్లిస్తుంటారు. అలాంటి అవసరాలకు ప్రతిరోజు 1,000 లారీల తాగునీటిని విక్రయిస్తుంటారు. ప్రస్తుతం రిజర్వేషన్ చేసుకునే తాగునీటి ట్యాంకర్ల ఛార్జీలను మెట్రోవాటర్ బోర్డు పెంచింది. ఆ ప్రకారం, 6వేలు, 9వేల లీటర్ల తాగునీటి ట్యాంకర్ ఛార్జీలు పెంచగా, 12వేలు, 18వేల లీటర్ల తాగునీటి ట్యాంకర్ ఛార్జీల్లో ఎలాంటి మార్పులు లేవు. అపార్ట్‌మెంట్లకు అందజేస్తున్న 6వేల లీటర్ల ట్యాంకర్‌కు వసూలుచేస్తున్న రూ.475 ఛార్జీని రూ.550కి, 9వేల లీటర్ల ట్యాంకర్‌కు వసూలుచేస్తున్న రూ.700 ఛార్జీ రూ.825కు పెరిగింది. ఇక, 12వేల లీటర్ల ట్యాంకర్ ఛార్జీ రూ.1,100, 18వేల లీటర్ల ట్యాంకర్ ఛార్జీ రూ.1,650లో ఎలాంటి మార్పులు చోటుచేసుకోలేదు. అదే సమయంలో, వాణిజ్య అవసరాలకు సరఫరా చేస్తున్న 6వేల లీటర్ల తాగునీటి ట్యాంకర్ ఛార్జీ రూ.735 నుంచి రూ.1,025, 9వేల లీటర్ల తాగునీటి ట్యాంకర్ ఛార్జీ రూ.1,050 నుంచి రూ.1,535కు పెంచారు. కానీ, 12వేల లీటర్ల ట్యాంకర్ ఛార్జీ రూ.2,050, 18వేల లీటర్ల ట్యాంకర్ ఛార్జీ రూ.3,070లో ఎలాంటి మార్పులు లేవని మెట్రోవాటర్ బోర్డు తెలిపింది.

ఎగ్మూర్ నుంచే సేతు ఎక్స్‌ప్రెస్

పెరంబూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎగ్మూర్-రామేశ్వరం-ఎగ్మూర్ రైళ్లు ఎగ్మూర్ స్టేషన్ నుంచి బయల్దేరనున్నాయి. ఈ మేరకు దక్షిణ రైల్వే విడుదల చేసిన ప్రకటనలో వివరాలు ఇలా ఉన్నాయి. ఎగ్మూర్ రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనుల కారణంగా ఈ స్టేషన్‌నుంచి బయల్దేరాల్సిన, రావాల్సిన పలుఎక్స్‌ప్రెస్ రైళ్లను తాంబరం, చెన్నై బీచ్ నుంచి నడుపుతున్నారు. ఈక్రమంలో నెం.22662 రామేశ్వరం-చెన్నై ఎగ్మూర్ సేతు ఎక్స్‌ప్రెస్ రైలు ఆదివారం నుంచి తాంబరంకు బదులు చెన్నై ఎగ్మూర్ చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.22621 చెన్నై ఎగ్మూర్-రామేశ్వరం సేతు ఎక్స్‌ప్రెస్‌రైలు సోమవారంనుంచి చెన్నై ఎగ్మూర్‌స్టేషన్ నుంచి బయల్దేరుతుందని దక్షిణ రైల్వే తెలిపింది.

రాష్ట్రంలో 10 శాతం అదనపు వర్షపాతం

పెరంబూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నైరుతి రుతుపవనాల ప్రభావంతో శనివారం వరకు సాధారణంకన్నా 10శాతం అదనపు వర్షపాతం నమోదైంది. ఈ మేరకు వాతావరణ పరిశోధన కేంద్రం విడుదల చేసిన ప్రకటనలో వివరాలు ఇలా ఉన్నాయి. నైరుతి రుతుపవనాలతో సాధారణ వర్షపాతం 379.3 మి.మీ కాగా, శనివారం వరకు 416.1 మి.మీ వర్షపాతం నమోదైంది. అలాగే, రాజధాని నగరం చెన్నైలో సాధారణం కన్నా 1 శాతం అదనపు వర్షపాతం నమోదైంది. నగరంలో సాధారణ వర్షపాతం 707.5 మి.మీ కాగా, శనివారం వరకు 714.7 మి.మీ వర్షపాతం నమోదైందని వాతావరణ కేంద్రం తెలిపింది.

రైళ్లలో 'ఎలక్ట్రిక్ కెటిల్' తీసుకెళ్తే ఐదేళ్ల జైలు

పెరంబూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైళ్లలో 'ఎలక్ట్రిక్ కెటిల్' అనే వేడినీరు కాచే పాత్ర వినియోగంపై నిషేధం విధించారు. నిబంధన అతిక్రమించిన వారికి ఐదేళ్ల జైలుశిక్ష విధిస్తామని రైల్వే భద్రతా పోలీసు అధికారులు హెచ్చరించారు. ఈ విషయమై రైల్వే భద్రతా విభాగం అధికారులు మాట్లాడుతూ... ఎక్స్‌ప్రెస్ రైళ్లలో సెల్‌ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లు 'ఛార్జి' చేసుకొనేలా ఛార్జింగ్ పాయింట్లు ఏర్పాటుచేశామన్నారు. కానీ, కొందరు 'కెటిల్' అనే విద్యుత్‌తో పనిచేసే పాత్ర వినియోగించి టీ, కాఫీ తయారుచేస్తున్నట్లు ఫిర్యాదులు అందాయన్నారు. ఇటీవల, మహారాష్ట్రలో ఓ మహిళ వెళ్తున్న రైలులో కెటిల్ వినియోగించి న్యూడుల్స్ చేస్తున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో విడుదలైందన్నారు. ఆమెపై పోలీసులు చర్యలు చేపట్టారని తెలిపింది. రైళ్లలో అగ్నిప్రమాదాలకు అవకాశం ఉన్న టపాసులు, వంట గ్యాస్ సిలిండర్లు, ఆమ్లం, పెట్రోల్, కిరోసిన్ తదితరాలు తీసుకెళ్లడంపై నిషేధం ఉందన్నారు. ఈ క్రమంలో, రైళ్లలోని ఛార్జింగ్ పాయింట్లతో కెటిల్ పరికరం వినియోగించడంపై నిషేధం విధించినట్లు, అలాంటి చర్యలకు పాల్పడే వారికి రూ.1,000 జరిమానా లేదా ఐదేళ్ల జైలుశిక్ష లేదా రెండూ విధించనున్నట్లు రైల్వే భద్రతా విభాగం అధికారులు తెలిపారు.

మాదకద్రవ్యాలతో 29మంది విదేశీయుల అరెస్ట్

● గ్రేటర్ చెన్నై పోలీసుల వెల్లడి




పట్టుబడిన నిందితులను చూపుతున్న పోలీసులు

ప్యారీస్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిషేధించిన మాదకద్రవ్యాలను అక్రమంగా తరలించడం, చట్టవిరుద్ధంగా విక్రయించడాన్ని అడ్డుకోవాలని రాష్ట్రప్రభుత్వం పోలీస్‌శాఖకు ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఎక్సైజ్ విభాగం అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.కోట్లు విలువచేసే మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో నగరంలో గత జనవరి నుంచి మాదకద్రవ్యాల కేసుల్లో ఇప్పటివరకు 29 మంది సుడాన్, నైజీరియా దేశాలకు చెందిన వారిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

సినీ నిర్మాత వద్ద విచారణ...

గత 2021వ సంవత్సరం శింబు నటించి విడుదలైన 'ఈశ్వరన్' అనే చిత్రనిర్మాతలలో ఒకరైన సర్పుద్దీన్‌ను గంజాయి కేసుకు సంబంధించి నగర పోలీసులు అరెస్ట్ చేశారు. ఆయన ఇంట్లో నిర్వహించిన తనిఖీల్లో కొకైన్, మెథాబెటమిన్, ఓజీ గంజాయి తదితర మాదకద్రవ్యాలతో పాటు రూ.27లక్షల నగదు, 3 యాపిల్ ఐఫోన్లను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈనేపథ్యంలో, మాదకద్రవ్యాల కేసుకు సంబంధించి విచారణ జరిపేందుకు కోర్టు అనుమతితో నిర్మాత సర్పుద్దీన్‌ను స్థానిక తిరుమంగళం పోలీసులు తమ కస్టడీలోకి తీసుకుని శుక్రవారం నుంచి విచారణ జరుపుతున్నారు. ఆయన సినీ రంగంలో ఎవరెవరికి మాదకద్రవ్యాలు సరఫరా చేశారు? ఏ ప్రాంతం నుంచి కొనుగోలు చేశారు? అన్న కోణంలో విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

ఈవీఎంలపై తొలివిడత శిక్షణ ప్రారంభం



పెరంబూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శాసనసభ ఎన్నికలను పురస్కరించుకుని తొలివిడత ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎం)లపై తొలివిడత శిక్షణ ప్రారంభమైంది. రాష్ట్ర శాసనసభకు 2026 ఏప్రిల్‌లో ఎన్నికలు జరుగనున్నాయి. అందుకోసం ముందస్తు ఏర్పాట్లను కేంద్ర ఎన్నికల కమిషన్ ముమ్మరం చేసింది. ప్రస్తుతం 'సర్' అనే ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పనులు తుదిదశకు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో, ఈవీఎం యంత్రాలు, ఓటు నమోదు ధ్రువీకరణ యంత్రం పనిచేసే విధానంపై తొలివిడత శిక్షణ శుక్రవారం నగరంలో జరిగింది. ఈశిక్షణలో అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, జిల్లా డిప్యూటీ ఎన్నికల అధికారులు, ఎన్నికల పర్యవేక్షకులు పాల్గొన్నారు. ఎన్నికల కమిషన్ ప్రధాన డిప్యూటీ కమిషనర్ భానుప్రకాష్, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి అర్చనా పట్నాయక్, భారత ఎన్నికల కమిషన్ కార్యదర్శి మధుసూదనన్, కర్ణాటక రాష్ట్ర ఉప ప్రధాన ఎన్నికల అధికారి రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు. ఈవీఎంల పనితీరుపై బెంగళూరులోని 'భారత్ ఎలక్ట్రానిక్స్' సాంకేతిక నిపుణులు శిక్షణ ఇచ్చారు.

ఉచిత నేత్ర వైద్యశిబిరానికి స్పందన


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


పెరంబూర్, డిసెంబరు 6 (ఆంధ్ర జ్యోతి): స్థానిక గోపాలపురంలోని గీతా భవన్ కల్యాణ మండపంలో శనివారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. శ్రీగీతా భవన్ ట్రస్ట్, ఆరోగ్య భారతి తమిళనాడు, శంకర నేత్రాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించారు. శిబిరంలో పాల్గొన్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్య సిబ్బంది, వారికి తగిన సూచనలు, సలహాలు అందజేశారు. క్యాటరాక్ట్ శస్త్రచికిత్స అవసరమైన వారికి శంకర్ నేత్రాలయంలో ఉచిత బస, భోజన వసతి కల్పించి, ఉచితంగా శస్త్రచికిత్స నిర్వహించనున్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు. ఈ శిబిరం ఏర్పాట్లను ట్రస్ట్ నిర్వాహకులు మానుగోయల్, మురళిలాల్ చందోలియా, కేకే గుప్తా, వైద్యులు హరిహరన్ తదితరులు పర్యవేక్షించారు.

అటవీ ప్రాంతంలో 3 ఏనుగుల కళేబరాలు


ఏనుగుల కళేబరాలను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

వేలూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా పేర్నాంబట్టు సమీపంలోవున్న ఆంధ్రప్రదేశ్-తమిళనాడు సరిహద్దు ప్రాంతంలోని కొండప్రాంతంలో మృతిచెందిన మూడు ఏనుగుల కళేబరాలను అటవీశాఖ సిబ్బంది గుర్తించారు. ఆ ప్రాంతంలో శనివారం ఉదయం అల్లి చెరువు సమీపంలో 3 ఏనుగులు మృతిచెంది కుళ్లిపోయిన స్థితిలో వాటి కళేబరాలు ఉన్నాయని అక్కడి స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు అక్కడికి చేరుకున్న అటవీశాఖ అధికారి పెరియస్వామి, విల్లుపురం జంతు వైద్యులు కలైవాసన్ నేతృత్వంలోని 10 మంది సభ్యులు ఏనుగుల కళేబరాలను పరిశీలించారు. అనంతరం పెరియస్వామి మీడియాతో మాట్లాడుతూ, గత కొన్ని నెలలుగా ఈ ప్రాంతంలో 10కి పైగా ఏనుగుల కళేబరాలు లభ్యమవుతున్నాయని, ఈ మూడు ఏనుగులు నీరు, ఆహారంలేకపోవడంతో మృతిచెందాయా?, పిడుగుపాటుకు మృతి చెందాయా? ఇంకేమైనా కారణమా? అనే కోణాల్లో విచారణ చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. చిత్తూరు-వేలూరు-విల్లుపురం సరిహద్దు ప్రాంతమైన ఈ కొండప్రాంతంలో అనుమానాస్పదంగా మృతిచెందిన 3 ఏనుగుల కళేబరాలను స్వాధీనం చేసుకుని పరిశోధన కేంద్రానికి తరలించినట్లు ఆయన తెలిపారు.

అంబేడ్కర్‌కు కలెక్టర్ నివాళి


అంబేడ్కర్ విగ్రహం వద్ద కలెక్టర్ సుబ్బులక్ష్మి నివాళి

వేలూరు, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): బాబాసాహెబ్ డా.బీఆర్ అంబేడ్కర్ 69వ వర్ధంతి సందర్భంగా శనివారం జిల్లావ్యాప్తంగా పలువురు నేతలు, ప్రముఖులు ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలదండలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈక్రమంలో వేలూరు కలెక్టరేట్ ప్రాంగణంలోని అంబేడ్కర్ విగ్రహానికి జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి ప్రభుత్వ ఉన్నతాధికారులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు.

9న పుదుచ్చేరిలో విజయ్ బహిరంగ సభ

● 5వేల మందికి మాత్రమే అనుమతి

పుదుచ్చేరి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర పాలిత రాష్ట్రం పుదుచ్చేరిలో ఈ నెల 9వ తేదీన తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ పాల్గొననున్న బహిరంగ సభలో పాల్గొనేందుకు 5వేల మందిని మాత్రమే అనుమతించనున్నట్లు ఆ రాష్ట్రపోలీసుశాఖ తెలిపింది. రాష్ట్ర అసెంబ్లీకి 2026లో జరగనున్న ఎన్నికల్లో మొట్టమొదటిసారిగా సినీ నటుడు విజయ్ నేతృత్వంలోని టీవీకే పోటీ చేయనుంది. ఆ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా విజయ్ చేపట్టిన సుడిగాలి పర్యటన కరూర్ దుర్ఘటన నేపథ్యంలో కాస్త వేగం తగ్గింది. తొక్కిసలాటలో 41 మంది మృతిచెందిన తర్వాత పోలీస్‌శాఖ రోడ్ షోకు అనుమతించకపోవడంతో ఆయన కొద్దిమంది కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో గత నెల కాంచీపురంలో జరిగిన కార్యక్రమంలో పాసులున్న రెండు వేలమందిని మాత్రమే అనుమతించారు. ఆ తర్వాత పొరుగు రాష్ట్రమైన పుదుచ్చేరిలో రోడ్‌షోను నిర్వహించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఆ ముఖ్యమంత్రి రంగస్వామి అధికారులతో చర్చించి టీవీకే తరుపున బహిరంగ సభ నిర్వహించుకునేందుకు అనుమతులు జారీచేశారు. వచ్చే 9వ తేదీ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు బహిరంగ సభ నిర్వహించేందుకు అనుమతించిన పోలీసుశాఖ ఈ సభలో 5వేల మంది మాత్రమే పాల్గొనాలని ఉత్తర్వులు జారీచేసింది.

ఘనంగా పరాశక్తి అమ్మన్ తెప్పోత్సవం



వేలూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై జిల్లాలో ప్రసిద్ధి చెందిన అరుణాచలేశ్వరాలయంలో గత నెల 24వ తేదీ ప్రారంభమైన కార్తిక దీపోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో 13వ రోజైన శుక్రవారం రాత్రి పంచమూర్తుల్లో ఒకరైన పరాశక్తి అమ్మవారిని అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకుల వేదమంత్రోచ్చారణ, భక్తుల దివ్యనామస్మరణ, మేళతాళాల నడుమ నిర్వహించిన తెప్పోత్సవం వేడుక కన్నులపండువగా సాగింది. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తీర్థకొలను వద్ద బారులు తీరారు.

1,050 మెగావాట్ల విద్యుదుత్పత్తికి అంతరాయం

పెరంబూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి థర్మల్ విద్యుత్ కేంద్రంలో 1,050 మెగావాట్ల విద్యుదుత్పత్తికి అంతరాయం కలిగింది. ఈ కేంద్రంలో ఐదు యూనిట్లలో 1,050 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోంది. ఈ విద్యుత్‌ను సమీపంలోని జిల్లాలకు సరఫరా చేస్తుంటారు. ఈ క్రమంలో, గత మార్చి 15వ తేది కేంద్రంలో సంభవించిన అగ్నిప్రమాదంలో మొదటి, రెండవ యూనిట్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. నాలుగు, ఐదు యూనిట్లను పర్యవేక్షణ పనుల కారణంగా కొద్ది నెలల క్రితం ఉత్పత్తి నిలిపివేశారు. ప్రస్తుతం మూడవ యూనిట్‌లో మాత్రం 210 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోంది. ఈ యూనిట్ శుక్రవారం రాత్రి మరమ్మతులు తలెత్తి విద్యుదుత్పత్తి నిలిచిపోయింది. ఈ కారణంగా, కేంద్రంలో ఐదు యూనిట్లలో ఒకేసారి పూర్తిస్థాయిలో విద్యుదుత్పత్తి నిలిచిపోయింది.

తిరుచెందూర్‌లో 75 అడుగులు వెనక్కిమళ్లిన సముద్రం



పెరంబూర్,డిసెంబరు6(ఆంధ్రజ్యోతి):తిరుచెందూర్‌లో శనివారం సముద్రం 75 అడుగుల మేర వెనక్కి వెళ్లింది. రాష్ట్రంలో ప్రసిద్ధిచెందిన ఆలయాల్లో ఒకటైన తిరుచెందూర్ మురుగన్ ఆలయాన్ని పెద్దసంఖ్యలో భక్తులు సందర్శిస్తుంటారు. తొలుత భక్తులు ఆలయం సమీపంలోని సముద్రతీరంలో పుణ్యస్నానాలు ఆచరించి, ఆలయానికి వెళ్లి స్వామివారిని దర్శించుకుంటుంటారు. కొద్దినెలలుగా పౌర్ణమి ముందు, తర్వాత రోజుల్లో తిరుచెందూర్‌లోని సముద్రం వెనక్కి వెళ్లడం జరుగుతోంది. అలా వెళ్లిన సముద్రం కొద్దిసేపటికి యథాస్థితికి చేరుకుంటుంది. ఈ క్రమంలో, శనివారం ఉదయం సముద్రం ఒక్కసారిగా 75 అడుగుల వెనక్కి వెళ్లడంతో, దిగువ ఉన్న పాచిపట్టిన బండరాళ్లు, సముద్రపు జీవులు బయటపడ్డాయి. ఈ బండరాళ్ల మీద నిలబడి భక్తులు, పర్యాటకులు సెల్ఫీ తీసుకున్నారు. కొద్దిసేపటి అనంతరం సముద్రం యథాస్థితికి చేరుకుంది.

న్యాయస్థానం తీర్పు అంగీకరించాలనే చట్టం లేదు..!

● మంత్రి పెరియస్వామి



పెరంబూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): న్యాయస్థానం తీర్పు అంగీకరించాలనే చట్టం లేదని, మన హక్కులు పొందేలా సుప్రీంకోర్టులో అప్పీలు చేసినట్లు మంత్రి పెరియస్వామి వ్యాఖ్యానించారు. దిండుగల్‌లో శనివారం అంబేడ్కర్ విగ్రహానికి మంత్రి పెరియస్వామి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి విలేఖరులతో మాట్లాడుతూ... తిరుప్పరంగుండ్రం వ్యవహారంలో డీఎంకే ప్రభుత్వం సరైన దారిలోనే వెళ్తుందన్నారు. రాష్ట్రంలో మతవాద రాజకీయాలు చేయాలని కొందరు ప్రయత్నిస్తున్నారని, అలాంటి వారిని రాష్ట్ర ప్రజలు క్షమించబోరని అన్నారు. 'సర్' పేరుతో ఓటరు జాబితా సవరణ చేపట్టి ఒకే రాత్రి తన నియోజకవర్గంలో 22,000 ఓట్లు తొలగించారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశామన్నారు. పోలింగ్ బూత్ అధికారులు ఇంటింటికి వెళ్లి ఓటర్ల జాబితా సరిచూసి ఫారాలు అందించడం లేదని, ఒకే ప్రాంతంలో కూర్చుని సర్ పనులు చేపడుతున్నారని ఆరోపించారు. దిండుగల్ డీఎంకే నిర్వాహకులు మృతిచెందాడని ఓటరు జాబితా నుంచి పేరు తొలగించారన్నారు. ఆత్తూర్ నియోజకవర్గం పరిధిలోని నరికల్‌పట్టి, నీలమలైకోట తదితర ప్రాంతాల్లోనూ సర్ పనుల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా సర్ ప్రక్రియలో అవకతవకలు చోటుచేసుకున్నాయని, అందువల్ల సర్‌ను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని మంత్రి డిమాండ్ చేశారు. తమిళగ వెట్రి కళగం (టీవీకే)లో సెంగోట్టయన్, నాంజిత్ సంపత్ చేరడంపై మంత్రి స్పందిస్తూ... టీవీకే ప్రజాదరణ పొందిన పార్టీ కాదని, ఆ పార్టీలో ఎంతమంది చేరినా డీఎంకేకు ఎలాంటి నష్టం లేదని మంత్రి తెలిపారు.

విజయ్‌తో ప్రవీణ్ చక్రవర్తి భేటీ అయిన విషయం తెలియదు

● టీఎన్‌సీసీ చీఫ్ సెల్వపెరుందగై


అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న సెల్వపెరుందగై, కాంగ్రెస్ నేతలు

ప్యారీస్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం (టీవీకే)అధ్యక్షుడు విజయ్‌తో కాంగ్రెస్ సీనియర్ నేత ప్రవీణ్ చక్రవర్తి శుక్రవారం భేటీ అయిన విషయం తనకు తెలియదని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు సెల్వపెరుందగై పేర్కొన్నారు. శనివారం బాబాసాహెబ్ డా.అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని నగరంలో ఆయన విగ్రహానికి పూలదండలు వేసి నివాళులర్పించిన సందర్భంగా టీఎన్‌సీసీ చీఫ్ సెల్వపెరుందగైను విలేఖర్లు విజయ్-ప్రవీణ్ చక్రవర్తి భేటీ గురించి ప్రశ్నించారు. అందుకు ఆయన సమాధానమిస్తూ, ఈ భేటీ వ్యవహారం తనకు తెలియదని, డీఎంకే నేతృత్వంలో ఇండియా కూటమి బలంగా ఉందన్నారు.

జాతి నిర్మాణంలో అంబేడ్కర్ పాత్ర గొప్పది

● కస్టమ్స్ డిప్యూటీ కమిషనర్ మోహన్


అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మద్రాస్ కస్టమ్స్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘ నాయకులు

ప్యారీస్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కులవివక్షను అంతం చేసి సమానత్వం పెంపొందింపజేసి సమ సమాజాన్ని నిర్మించిన రాజ్యాంగ నిర్మాత డా.బాబా సాహెబ్ అంబేడ్కర్ జాతి నిర్మాణంలో వహించిన పాత్ర గొప్పదని కస్టమ్స్ డిప్యూటీ కమిషనర్ ఎస్.మోహన్ కొనియాడారు. స్థానిక హార్బర్ నియోజకవర్గంలోని కస్టమ్స్ కార్యాలయ ప్రాంగణంలో శనివారం అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా మద్రాస్ కస్టమ్స్ ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి పుష్పగుచ్ఛం ఉంచి ఘనంగా నివాళులర్పించారు. సంఘ ట్రెజరర్ ఎంఎస్.కార్తికేయన్, ఉపాధ్యక్షుడు పి.ఆదిలక్ష్మణ్, టి.బాబు, బి.రమేష్‌బాబు, కన్నదాసన్, ప్రేమ్, లోకనాథన్, ఇందిరా, శశిరేఖ, ప్రేమ, నాగరాజు తదితరులతో పాటు డిప్యూటీ కమిషనర్ మోహన్ దేశానికి భారతరత్న అంబేడ్కర్ అందించిన సేవలను స్మరించుకున్నారు.

దుర్భర స్థితిలో రేషన్ దుకాణ ప్రాంగణం


రేషన్ దుకాణం ముందు నిలిచిన మురుగునీరు

తిరుత్తణి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): దుర్భరస్థితిలో ఉన్న రేషన్ దుకాణ ప్రాంగణాలకు గ్రామస్తులు రావడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తిరువళ్లూరు జిల్లా తిరువలంగాడు సమీపంలోని చిన్నమండలి గ్రామంలో వున్న రేషన్ దుకాణానికి ప్రతినెలా అక్కడి ప్రజలు వచ్చి సరుకులు కొనుగోలు చేసి తీసుకెళుతుంటారు. ఈ నేపథ్యంలో, గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీవర్షానికి ఆ గ్రామంలోని లోతట్టు ప్రాంతాల్లో మురుగునీరు నిలిచిపోయింది. ఈ క్రమంలో శనివారం ఉదయం రేషన్ సరుకులు తీసుకోవడానికి వెళ్లిన గ్రామస్తులు అక్కడ పేరుకుపోయిన బురద, మురుగునీటి కారణంగా తీవ్ర అవస్థలు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీనిపై గ్రామస్తులు మీడియాతో మాట్లాడుతూ, గత కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షానికి రేషన్ దుకాణ భవన ప్రాంగణంలోకి వర్షపునీరు ప్రవేశించడంతో ఆ ప్రాంతంలో మురుగునీరు నిలిచిపోయిందని, దీనితో దోమల బెడద విపరీతంగా పెరిగి ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారన్నారు. అధికారులు దీనిపై చర్యలు తీసుకుని రేషన్ దుకాణ ప్రాంతాల్లోనే కాకుండా గ్రామంలోని రోడ్లపై నిలిచిపోయిన మురుగునీటిని తొలగించి, క్రిమి సంహారక మందులు కొట్టించాల్సిందిగా కోరారు.

నడిసముద్రంలో పడవ బోల్తా

● సురక్షితంగా తీరానికి చేరుకున్న జాలర్లు


పడవను తాళ్ల ద్వారా తీరానికి తీసుకొస్తున్న జాలర్లు

పెరంబూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నడిసముద్రంలో పడవ బోల్తాపడిన ఘటనలో ముగ్గురు జాలర్లు సురక్షితంగా తీరానికి చేరుకున్నారు. 'దిత్వా' తుపాను కారణంగా కడలూరు జాలర్లు పదిరోజులుగా చేపల వేటకు వెళ్లలేదు. వర్షాలు తగ్గడంతో కడలూరు తాళంగుడ ప్రాంతానికి చెందిన రాఘవేంద్రన్, దివాకర్, నటరాజన్‌లు ఫైబర్ పడవ ద్వారా శుక్రవారం చేపల వేటకు వెళ్లారు. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో చేపల వేట సాగిస్తుండగా, సముద్రంలో వీచిన బలమైన గాలులతో పడవ బోల్తాపడింది. సముద్రంలో పడిన ముగ్గురు జాలర్లు ఈత కొడుతూ తీరానికి చేరుకున్నారు. అనంతరం సహచర జాలర్ల సహకారంతో సముద్రంలో మునిగిన పడవను తాళ్ల సాయంతో తీరానికి చేర్చారు. పడవ సముద్రంలో మునగడంతో సుమారు రూ.లక్ష విలువైన వలలు, ఇతర పరికరాలు నీటమునిగాయని, ఈ ఘటనలో పడవ కూడా దెబ్బతిందని జాలర్లు ఆవేదన వ్యక్తం చేశారు.

పోక్సో కేసులో రూ.10వేల లంచం

● ప్రభుత్వ న్యాయవాది అరెస్ట్


ప్రభుత్వ న్యాయవాది కల్పన

పెరంబూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): లైంగిక వేధింపులకు గురైన మైనర్ బాధితురాలి కేసు విచారించేందుకు రూ.10వేలు లంచం తీసుకున్న ధర్మపురి పోక్సో ప్రభుత్వ మహిళా న్యాయవాదిని అవినీతి నిరోధక శాఖ పోలీసులు అరెస్ట్ చేశారు. ధర్మపురి జిల్లా పయర్‌నత్తం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినిపై ఒకరు లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఈ వ్యవహారంపై నమోదైన పోక్సో కేసు ధర్మపురి జిల్లా పోక్సో ప్రత్యేక కోర్టులో విచారణ జరుగుతోంది. బాధిత బాలిక తరపున ప్రభుత్వ న్యాయవాది కల్పన హాజరయ్యారు. కేసు నడిపించేందుకు రూ.15 వేలు లంచం ఇవ్వాలని కల్పన బాధిత బాలిక తండ్రిని డిమాండ్ చేసినట్లు సమాచారం. లంచం ఇచ్చేందుకు ఇష్టం లేని అతను, జిల్లా అవినీతి నిరోధక శాఖ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల సూచన మేరకు రసాయనాలు కలిపిన రూ.10వేల విలువైన కరెన్సీ నోట్లు న్యాయవాది కల్పనకు అందజేశారు. ఆమె డబ్బును తన బెంచి డ్రాలో వేశారు. ఆ సమయంలో అక్కడే మాటువేసిన అవినీతి నిరోధక విభాగం పోలీసులు, కల్పనను రెడ్ హ్యాండ్‌గా పట్టుకుని విచారిస్తున్నారు.

ఇంటిల్లిపాది మెచ్చే సినిమాలు తీయాలి

దర్శకుడు ఆర్వీ ఉదయకుమార్


లెనిన్, అస్మిన్

ఒక వర్గ ప్రేక్షకులు మాత్రమే చూడదగిన చిత్రాలు కాకుండా ఇంటిల్లిపాది మెచ్చే జీవిత కథలతో సినిమాలు తీయాలని ప్రముఖ దర్శకుడు, కోలీవుడ్ దర్శకుల సంఘం అధ్యక్షుడు ఆర్వీ.ఉదయకుమార్ అన్నారు. రెవ్‌జెన్ ఫిల్మ్ ఫ్యాక్టరీ పతాకంపై నిర్మాత లెనిన్ 'రెడ్ లేబుల్' పేరుతో చిత్రాన్ని నిర్మించగా, కేఆర్ వినోద్ దర్శకుడు. లెనిన్, అస్మిన్‌లు హీరోహీరోయిన్లుగా నటించారు. ఇతర ముఖ్య పాత్రల్లో ఆర్వీ ఉదయకుమార్, తరుణ్, కెవిన్, కార్మేగం శశి, అనుషా, గౌరవ పాత్రలో మునీష్‌కాంత్ నటించారు. ఈ చిత్రం ఆడియో, ట్రైలర్ రిలీజ్ వేడుక నగరంలో తాజాగా జరిగింది. ఇందులో సీనియర్ దర్శకులు ఆర్వీ ఉదయకుమార్, పేరరసు, వసంత్ బాలన్, మిత్రన్ జవహర్, ఎళిల్ తదితరులు అతిథులుగా పాల్గొని ఆడియోను రిలీజ్ చేశారు. ఇందులో దర్శకుడు ఆర్వీ ఉదయకుమార్ మాట్లాడుతూ, 'గత పదేళ్లుగా మంచి స్టోరీలతో సినిమాలు రావడం లేదు. 'పాసమలర్', 'కుడుంబం ఒరు కదంబం' వంటి సినిమాలు ఇప్పుడు ఎక్కువ వస్తున్నాయి. ఆ కాలంలో ఒక సినిమా నచ్చితే ఇంటి వరండాలో కూర్చొని చర్చించుకునేవారు. ఆ తర్వాత ఎడ్లబండ్లపై కుటుంబ సభ్యులంతా కలిసి వెళ్లి చూసేవారు. అలాంటి పరిస్థితి ఇపుడు ఎక్కడ ఉంది. ఒక వర్గం వారు మాత్రమే చూసి ఎంజాయ్ చేసే చిత్రాలు నిర్మిస్తున్నారు. థియేటర్లకు ప్రేక్షకులు రావడం లేదని గగ్గోలు పెడుతున్నాం. ప్రతి ఒక్కరూ చూడగలిగే జీవిత కథల ఆధారంగా సినిమాలు తీయాలి. ఇందుకోసం కొత్త దర్శకులు ప్రయత్నించాలి' అని పేర్కొన్నారు. చిత్ర దర్శకుడు కేఆర్ వినోద్ మాట్లాడుతూ, 'మేం వర్ధమాన దర్శకులం. ఈ సినిమా ఒక వ్యక్తి ప్రయత్నంకాదు. ప్రతి ఒక్కరూ ఎంతగానో శ్రమించాం. ఉదయకుమార్ ఎంతగానో ఒక మార్గదర్శకుడుగా ఉంటూ అన్ని చక్కబెట్టారు. ఇది ఒక మంచి చిత్రం ప్రతి ఒక్కరికీ నచ్చుతుంది' అన్నారు. ఆ తర్వా నిర్మాత లెనిన్, చిత్రబృందం సభ్యులు, టెక్నీషియన్లు తదితరులు ప్రసంగించారు.


'మూన్‌వాక్' పాటలకు ఏఆర్ రెహ్మాన్ నేపథ్యగానం

ఇండియన్ మైఖేల్ జాక్సన్‌గా పేరుగడించిన ప్రముఖ కొరియోగ్రాఫర్ ప్రభుదేవా హీరోగా నటిస్తున్న 'మూన్‌వాక్' చిత్రానికి ఆస్కార్ అవార్డు గ్రహీత ఏఆర్ రెహ్మాన్ 27 యేళ్ల తర్వాత సంగీతం సమకూర్చడంతో పాటు ఇందులోని ఐదు పాటలకు ఆయనే నేపథ్యగానం చేశారు. బిహైండ్‌వుడ్స్ ప్రొడక్షన్స్ పతాకంపై రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని మనోజ్ నిర్మలా శ్రీధరన్, దివ్య మనోజ్, ప్రవీణ్ ఎలక్ నిర్మిస్తున్నారు. ఒక చిత్రంలోని ఐదు పాటలకు రెహ్మాన్ నేపథ్యగానం అందించడం ఇటీవలికాలంలో ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఈ ఆల్బమ్‌పై రెహ్మాన్ మాట్లాడుతూ, 'ప్రభుదేవాతో మళ్లీ పనిచేయడం చాలా సంతోషంగా ఉంది. అప్పటి ప్రభుదేవాకు, ఇప్పటి ప్రభుదేవాకు చిన్న తేడా నెరిసిన జుట్టు మాత్రమే. ప్రభుదేవా శక్తి ఒక్కటే. ఆయన నృత్యం చేస్తుంటే చూడటం నాకు మరింత ఉత్సాహాన్నిస్తుంది. ఒకపాట కోసం ఒక నెల పాటు ఒక పెద్ద కొరియోగ్రాఫర్ రిహార్సల్ చేయడం నేనెప్పుడూ చూడలేదు. అది అతనిలోని అంకితభావాన్ని రుజువు చేస్తుంది. ఒక సంగీత దర్శకుడిగా పాటకు సరైన గాయకుడిని ఎంచుకోవడం నా విధి. కానీ, నా సూచనలను దర్శకుడు మనోజ్ నిర్మలా శ్రీధరన్ నిరాకరించి, పాటలన్నీ నాతోనే పాడించారు' అని పేర్కొన్నారు. ప్రభుదేవా మాట్లాడుతూ, 'నా సినిమా ప్రయాణం ప్రారంభం నుంచి రెహ్మాన్ సంగీతం నాకు ఎల్లవేళలా స్ఫూర్తినిస్తుంది. ప్రేక్షకులు మూన్‌వాక్‌ను ఎంతగానో ఆస్వాదిస్తారు' అని పేర్కొన్నారు. ఈ చిత్రంలో ప్రభుదేవాతో పాటు యోగిబాబు, అజు వర్గీస్, అర్జున్ అశోకన్, నిమిషా చెంగప్ప, సింగంపులి, లొల్లు సభా స్వామినాథన్, రెడిన్ కింగ్‌స్లీ, సుష్మిత నాయక్, దీపా శంకర్, రామ్‌కుమార్ నటరాజన్ తదితరులు నటించారు.

చిత్రజ్యోతి


'మూన్‌వాక్'లో ఓ దృశ్యం

'హ్యాపీ రాజ్'గా జీవీ ప్రకాష్



'హ్యాపీ రాజ్'లో జీవీ ప్రకాష్

ప్రముఖ సంగీత దర్శకడు జీవీ ప్రకాష్ కుమార్ హీరోగా నటించే కొత్త చిత్రానికి 'హ్యాపీ రాజ్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ టైటిల్‌తో పాటు ప్రకాష్ కుమార్ లుక్‌ను మేకర్స్ శనివారం అధికారికంగా వెల్లడించారు. బియాండ్ పిక్చర్స్ పతాకంపై తెరకెక్కే ఈ చిత్రానికి కథ, దర్శకత్వం మరియ రాజ్ ఎలంజెళియన్. సహ నిర్మాత జైకాంత్ సురేష్, నిర్మాత జైవర్ధ. ఇందులో జీవీ ప్రకాష్, అబ్బాస్, జార్జ్ మరియన్, గౌరిప్రియ, ప్రార్థనా, మదురై ముత్తు, సోఫా బాయ్ రాహుల్ తదితరులు నటించారు. ఈ సినిమా టైటిల్, చిత్ర విశేషాలను దర్శకుడు వివరిస్తూ, 'హ్యాపీ రాజ్' టైటిల్ అనేది సరళమైనదే అయినప్పటికీ లోతైన ఆలోచన నుంచి ఉద్భవించిందన్నారు. నా చిత్రంలో హీరోకు హ్యాపీ అనే పేరు పెట్టడానికి ఒక కారణం ఉంది. ఆ పేరు కథలోని కేంద్ర భావాన్ని ఎల్లవేళలా గుర్తు చేసే ఓ చిహ్నం. 'హ్యాపీ' అనే పదం ప్రతి చోటా వినిపిస్తుంది. ఇది కేవలం ఒక పదం మాత్రమే కాదు. ఆశను ప్రేరేపించే లయతో కూడిన ఒక మంత్రం. కథ ప్రాథమికంగా స్వచ్ఛమైన, నిజమైన ఆనందం గురించి సాగుతుంది. అదేసమయంలో ఇది జీవితంలోని వివిధ భావోద్వేగాలను తాకుతుంది. 'హ్యాపీ రాజ్' మూవీ ఆనందకరమైన స్ఫూర్తిదాయకమైన అనుభవంగా ఉంటుంది. కోపం, ఆనందం, చిరునవ్వులు ఇలా ప్రతిదీ మన చేతుల్లోనే ఉన్నాయని అర్థమయ్యేలా చేస్తుంది' అని పేర్కొన్నారు. జస్టిన్ ప్రభాకరన్ సంగీతం అందించే ఈ చిత్రాన్ని వచ్చే యేడాది ప్రారంభంలో విడుదల చేయనున్నారు.

మూడు చిత్రాలపై ఆశలు పెట్టుకున్న కృతిశెట్టి



మంగుళూరుకు చెందిన కృతిశెట్టి 'ఉప్పెన' అనే తెలుగు చిత్రంతో వెండితెరకు పరిచయమయ్యారు. ఇప్పుడు తమిళంలో కూడా నిలదొక్కుకునేందుకు ఆరాటపడుతూ, తాను నటించిన మూడు చిత్రాలపై గంపెడాశలు పెట్టుకున్నారు. నిజానికి ఆమె హీరోయిన్‌గా నటించిన 'ది వారియర్', 'కస్టడీ' చిత్రాలు బాక్సాఫీస్ వద్ద బోల్తా పడ్డాయి. ఈ రెండు చిత్రాలకు దర్శకత్వం వహించింది తమిళ దర్శకులే అయినప్పటికీ కృతిశెట్టికి సరైన బ్రేక్ లభించలేదు. ఈ క్రమంలో ఆమె ఇపుడు తమిళంలో మూడు చిత్రాల్లో నటించారు. వీటిలో ఒకటి కార్తి 'వా వాత్తియార్', ప్రదీప్ రంగనాథన్ 'ఎల్‌ఐకే', రవి మోహన్ 'జీని' సినిమాలు ఉన్నాయి. 'వా వాత్తియార్', 'ఎల్‌ఐకే'లు ఈ నెలలో విడుదలకానున్నాయి. వచ్చే యేడాది రవి మోహన్ సినిమా విడుదలకానుంది. ఈ నెలలో విడుదలయ్యే చిత్రాలు హిట్ అయితే కోలీవుడ్‌లో నిలదొక్కుకోవచ్చన్న తలంపులో మంగుళూరు భామ ఉన్నారు. అయితే, గ్లామర్‌గా నటించేందుకు మాత్రం కృతిశెట్టి కాస్త వెనుకంజ వేస్తున్నారు. ఆ ఒక్కదానికి అడ్డు చెప్పకపోతే ఆమెకు వరుస సినీ అవకాశాలు వస్తాయని కోలీవుడ్ వర్గాలు పేర్కొంటున్నాయి.

భీమ్‌రావ్ అంబేడ్కర్‌కు రాష్ట్రవ్యాప్తంగా నివాళి


కొడుంగైయూర్ చిన్నాండి మఠంలోని అంబేడ్కర్ విగ్రహానికి గుడిమెట్ల చెన్నయ్య తదితరుల నివాళి


హార్బర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మార్పీఎస్ తమిళనాడు అధ్యక్షుడు లోకేష్ కుమార్ బృందం నివాళి


పళ్లికరణైలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న టామ్స్ నేతలు పెంచలయ్య, తిరుపాల్ తదితరులు


రామ్‌నగర్‌లో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న కప్పల పకీర్‌దాస్, పాల్‌కొండయ్య తదితరులు

ప్యారీస్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): న్యాయ, ఆర్థికశాస్త్ర నిపుణులు, రాజకీయ నేత, సంఘ సంస్కర్త, కేంద్ర న్యాయశాఖ తొలిమంత్రిగా వ్యవహరించి రాజ్యాంగాన్ని రూపొందించి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన భీమ్‌రావ్ డా.అంబేడ్కర్ 69వ వర్ధంతి సందర్భంగా శనివారం పలువురు ప్రముఖులు, తెలుగు సంఘాలు, కార్మిక సంఘాల నిర్వాహకులు ఘనంగా నివాళులర్పించారు. స్థానిక కొడుంగైయూర్ చిన్నాండి మఠంలోని అంబేడ్కర్ విగ్రహానికి 'జనని సాంస్కృతిక సంస్థ' ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య, మద్రాస్ విశ్వవిద్యాలయ తెలుగుశాఖాధిపతి ఆచార్య విస్తాలి శంకర్‌రావు, రెహమాన్, మాల్యాద్రి పూలదండలు సమర్పించి నివాళులర్పించారు. స్థానిక హార్బర్ పోర్ట్‌ట్రస్ట్ కార్యాలయ ప్రాంగణంలో అంబేడ్కర్ విగ్రహానికి మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) తమిళనాడు అధ్యక్షుడు కర్రా లోకేష్‌కుమార్ నేతృత్వంలో ఉపాధ్యక్షుడు దర్శిగుంట కిషోర్, వసంతరావు, జడ సుబ్బారావు, టి.గోపి, వి.కుమార్, దేవదాస్, నాగేష్, విష్ణుప్రసాద్, దామోదర్ తదితరులు పూలదండలు వేసి అంజలి ఘటించారు. ట్రిప్లికేన్ నియోజకవర్గంలోని రామ్‌నగర్‌లో గ్రామపెద్ద కప్పల పకీర్‌దాస్, పాల్ కొండయ్య, పూర్ణచంద్రన్, దీనదయాళన్, కేవీ.రావు తదితరులు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అలాగే పళ్లికరణైలోని తమిళనాడు ఆదిఆంధ్ర అరుంధతీయ మహాసభ (టామ్స్) ఆధ్వర్యంలో పెంచలయ్య, సీహెచ్.తిరుపాల్, సుబ్బయ్య, ఆర్.సుబ్రమణి తదితరులు అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. ద్రావిడ వెట్రి కళగం ఆర్గనైజర్ మల్లైసత్య, పెరుంతలైవర్ మక్కల్ కట్చి అధ్యక్షుడు ధనపాలన్, విల్లుపురం జిల్లా దిండివనం సమీపంలోని తైలాపురం గార్డెన్‌లో పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్, పలు దళిత సంఘాల నిర్వాహకులు రాజ్యాంగ శిల్పికి నివాళులర్పించారు.

ఎన్‌ఎల్‌సీ చైర్మన్‌కు 'ఎంఎస్ స్వామినాథన్ ఎక్స్‌లెన్స్' పురస్కారం



ప్రసన్నకుమార్‌కు పురస్కారం ప్రదానం చేస్తున్న తెలంగాణ గవర్నర్

చెన్నై, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): 'నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్' (ఎన్‌ఎల్‌సీ) ఇండియా లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ప్రసన్నకుమార్ మోటుపల్లిని ప్రతిష్ఠాత్మక 'ఎంఎస్ స్వామినాథన్ గ్రీన్ ఎక్స్‌లెన్స్' పురస్కారం వరించింది. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన ఎంఎస్ స్వామినాథన్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రసన్నకుమార్ మోటుపల్లికి ఈ పురస్కారం తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా ప్రదానం చేశారు. భారత్ క్లీన్ ఎనర్జీకి మారడంలో మోటుపల్లి చేసిన కృషికి గుర్తుగా ఈ పురస్కారాన్ని బహూకరించారు. ప్రసన్నకుమార్ ఎన్‌ఎల్‌సీ పునరుత్పాదక సామర్థ్య విస్తరణ, బాధ్యతాయుతమైన మైనింగ్ పద్ధతులు, పర్యావరణ పరిరక్షణ చర్యలను ఈ సందర్భంగా నిర్వాహకులు కొనియాడారు. ఈ కార్యక్రమానికి ఏపీ-తెలంగాణ యూకే డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్, ప్రముఖ నిపుణులు, విద్యావేత్తలు, ప్రభుత్వ ఉన్నతాధికారులు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా మోటుపల్లి భారత స్వచ్ఛ ఇంధన ఆశయాలు, ప్రపంచ స్థిరత్వ లక్ష్యాలకు అనుగుణంగా, ప్రజా కేంద్రీకృత విధానంతో పర్యావరణ బాధ్యతాయుతమైన వృద్ధికి సంస్థ నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ.. తనకు దక్కిన గౌరవాన్ని ఎన్‌ఎల్‌సీ ఇండియా కుటుంబానికి అంకితమిస్తున్నట్లు ప్రకటించారు.

'మినీ కోడంబాక్కం' పొల్లాచ్చి



SUNDAY SPECIAL



'కాదలిక్కనేరమిల్లై' నుంచి 'కలగలప్పు' దాకా...

25 ఏళ్ల క్రితం వరకు పొల్లాచ్చి, ఉడుమలై, వాల్పారై, తేని, కంభం, గోపిశెట్టిపాళయం పరిసర ప్రాంతాల్లో ఎన్నో సినిమాల షూటింగ్‌లు జరిగాయి. వాటిల్లో పొల్లాచ్చి పరిసర ప్రాంతాల్లోని పడమటికనుమలు, జలాశయాలు, వాగులు, పంట పొలాలు, కొబ్బరి, వక్క తోటలు, ప్రాచీన కాలం నాటి ఫామ్‌హౌస్‌లు ఎక్కువగా ఉండటం వల్ల సినిమాల షూటింగ్ పూర్తిగా ఈ ప్రాంతాల్లోనే జరిగేవి. ఈస్ట్‌మెన్ కలర్ మూవీల ఆరంభ దినాల్లోనూ తమిళ రంగుల సినిమాల షూటింగ్‌లు పొల్లాచ్చిలోనే ప్రారంభమయ్యాయి. ఇదే విధంగా పొల్లాచ్చి, ఉడుమలై ప్రాంతాల్లో చాలా షూటింగ్ స్పాట్‌లు ఉన్నాయి. అలాంటి కొన్ని ప్రదేశాలను చూద్దాం:

'కట్ట వండి కట్ట వండీ' అంటూ కమల్ హాసన్ పాడే పాటను ఇక్కడే తీశారు. కమల్ అప్పుడు కుర్రోడు.. 'కన్ను పడ పోగుదయ్యా చిన్న గౌండరే' పాట షూటింగ్ చేస్తున్నప్పుడు కెప్టెన్ (విజయకాంత్)ని చాలా దగ్గరగా చూశాం. మనోరమ మా ఇంటి తిన్నెపై వచ్చి కూర్చునేది. ఎంతోమంది సినిమావాళ్లను చూశాం. ఇప్పుడెవరూ మా ప్రాంతం వైపు కన్నెత్తి చూడటం లేదు. ఎందుకో నాకు తెలియదు' సేత్తుమడై ప్రాంతానికి చెందిన మహిళ లక్ష్మి మాటల్లో బాధ తొంగి చూసింది. ఆమే కాదు పొల్లాచ్చి చుట్టుపక్కల ఉన్న పలు గ్రామాలకు చెందిన ప్రజలు కూడా తమిళ, మలయాళ మూవీ స్టార్‌లను అతి దగ్గరగా చూసి ఆనందించడం, వారితో మాట్లాడటం, వారితో ఫొటోలు దిగటం గురించి ఇప్పటికీ కబుర్లు చెప్పుకుంటారు. 'మినీ కోడంబాక్కం' అని పేరుతెచ్చుకున్న పొల్లాచ్చిలో ఒకేరోజు ఎన్నో సినిమాల షూటింగ్‌లు జరుగుతుండేవి. ఇటీవలి కాలంలో ఈ ప్రాంతాల్లో సినిమా షూటింగ్‌లు బాగా తగ్గిపోయాయి. అయితే ఆ ప్రాంతాలు ప్రస్తుతం పర్యాటక కేంద్రాలుగా అందరినీ ఆకట్టుకుంటున్నాయి. పొల్లాచ్చి పరిసర ప్రాంతాల్లో షూటింగ్‌లు తగ్గటానికి ఇప్పటి తమిళ సినిమాలన్నీ గ్రామీణ కథలకు దూరంగా ఉండటమేనని, ఇప్పుడొస్తున్న సినిమాలన్నీ నగర వాతావరణంలో జరిగే కథాంశాలను కలిగి ఉండటమేనని తమిళ చిత్రసీమ ప్రముఖులు చెబుతున్నారు.


- టి.నగర్, ఆంధ్రజ్యోతి

1. ఆళియారు డ్యామ్



పరంబికుళం - అళియార్ ఇరిగేషన్ ప్రాజెక్టులో మొదటి డ్యామ్‌గా ఉన్న ఆళియార్ డ్యామ్‌ను అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ప్రారంభించారు. ఆ మరుసటి సంవత్సరమే ప్రముఖ సినీ దర్శకుడు శ్రీధర్ 'కాదలిక్క నేరమిల్లై' సినిమా షూటింగ్‌ని ఆ ప్రాంతంలోనే జరిపారు. ఆ మూవీలోని 'విశ్వనాథన్ వేలై వేనుమ్' అనే పాట ఆ డ్యామ్ అందాలను ప్రతిబింబిస్తుంది. 'అమైదిపడై' సినిమాలో హీరో సత్యరాజ్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచే ఓట్ల లెక్కింపు కేంద్రం దృశ్యాలు ఆళియారు డ్యామ్ గెస్ట్‌హౌస్ వద్దే జరిగింది. 'మౌనం సమ్మదమ్' మూవీలో హీరో మమ్ముట్టి, అమలా కబుర్లాడుకునే దృశ్యాలు, 'కళ్యాణ తేన్‌నిలా కాయ్‌చ్చాద పాల్‌నిలా' సాంగ్ సీన్‌లు ఈ డ్యామ్ వద్దే షూటింగ్ జరిపారు. 'కాదలుక్కు మర్యాదై' మూవీలో హీరో విజయ్ 'ఓ బేబి బేబీ ఎన్ దేవదేవీ' అంటూ పాడుకుంటూ బైకును వేగంగా నడిపే దృశ్యాల షూటింగ్ కూడా అక్కడే జరిగింది. ప్రస్తుతం ఈ డ్యామ్, చేరువగానే ఉన్న ఉద్యానవనాలను చూడటానికి పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు.

2. తిరుమూర్తి మలై డ్యామ్



కోయంబత్తూరు నుంచి 75 కి.మీ.ల దూరంలో, ఉడుమలై నుండి 20 కి.మీ. దూరంలో ఉంది తిరుమూర్తి మలై. ఆళియారు డ్యామ్‌లాగే తిరుమూర్తి డ్యామ్ కూడా పడమటి కనుమలకు చేరువగానే ఉంది. ఆళియారు కంటే తిరుమూర్తి డ్యామ్ ప్రాంతం వద్ద ఎక్కువగా సినిమా షూటింగ్‌లు జరిగాయి. 'కాదలుక్కు మర్యాదై' మూవీలో 'ఎన్నై తాలాట్ట వరువాలా' హిట్ సాంగ్ షూటింగ్ ఈ డ్యామ్ వద్దనున్న పచ్చికబయలులోనే జరిగింది. 'పొన్నియిన్ సెల్వన్' మూవీ రెండు భాగాలలోనూ ఈ డ్యామ్ వద్ద తీసిన సీన్‌లు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. కార్తీ గుర్రంపై స్వారీ చేసే సీన్, 'పొన్ని నది' సాంగ్‌లో కార్తీ నీటిని చేతులతో విసిరే సీన్, రెండోభాగంలో చిన్ననాటి ఐశ్వర్యాగా 'బేబీ సారా' పాల్గొనే సీన్‌లు తీశారు. ఇక్కడ కూడా ఎన్నో మూవీల షూటింగ్‌లు జరిగాయి. ఈ ప్రాంతం కూడా ప్రస్తుతం పర్యాటక ప్రాంతంగా మారింది.



3. కేకే పుదూరు రహదారి వంతెన

పొల్లాచ్చి అంబరాంపాళయం ప్రాంతానికి చేరువగా ఆళియారు వాగు మధ్య ఉంది కేకే పుదూరు రహదారి వంతెన. గౌండమణి - సెంథిల్ నటించిన పలు కామెడీ సీన్‌లు ఈ ప్రాంతం వద్దే తీశారు. 'కలగలప్పు' మూవీలో కొన్ని సీన్‌లు ఇక్కడే తీశారు. ఈ వంతెనకు చేరువగానే ఓ కల్వర్టు ఉంది. అక్కడే 'విన్నర్' మూవీలో ప్రశాంత్, వడివేలు నటించిన కొన్ని దృశ్యాలు చిత్రీకరించారు. ఆ సీన్‌లు మూవీలో ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించడంతో ఆ ప్రాంతానికి 'విన్నర్ పాల్స్' అనే పేరొచ్చింది.

4. కాళియాపురం రోడ్డు



పొల్లాచ్చి నుండి ఆనమలై వెళ్లే రోడ్డుకు ఇరువైపులా పచ్చటి గుడారాలను తలపించేలా వరుసగా చింతచెట్లు కలిగిన చల్లటి ప్రాంతమే కాళియాపురం రోడ్డు. ఆ మార్గంలో వెళ్లే ప్రతి వాహన చోదకుడూ అక్కడి పచ్చదనాన్ని కొద్ది సేపు ఆస్వాదించే వెళతాడు. 'వానత్తైపోల్', ధనుష్ నటించిన 'మాప్పిళ్లై', ఆంబళ, సూర్యవంశం వంటి పలు హిట్ చిత్రాలలో ఈ కాళియపురం రోడ్డు కనిపిస్తుందని లోకేషన్ అసిస్టెంట్ సబీక్ తెలిపారు. ప్రస్తుతం ఈ రహదారిలో వీడియోగ్రాఫర్లు నూతన వధూవరులను నిలిపి వీడియో తీయటం ఆనవాయితీగా మారిందని చెప్పారు.

5. సింగానల్లూరు బంగళా

పొల్లాచ్చికి సమీపంలో సింగానల్లూరు గ్రామం నడిబొడ్డున ఈ బంగళా ఉంది. శివాజీ, కమల్ నటించిన మెగాహిట్ మూవీ 'దేవర్‌మగన్' ఈ బంగళాలోనే షూటింగ్ జరుపుకుంది. ముర్రై మాప్పిళ్లై, అరణ్‌మణై, అంబాళ్ వంటి సినిమాల షూటింగ్‌లు కూడా ఈ బంగళాలోనే జరిగాయని సబీక్ తెలిపారు. ఇటీవలి కాలంలో ఈ బంగళాలో తమిళ మూవీల కంటే హిందీ, మలయాళ మూవీల షూటింగ్‌లే ఎక్కువగా జరుగుతున్నాయి. షూటింగ్‌లు లేని రోజుల్లో ఈ బంగళాను సీమంతం, బర్త్‌డే పార్టీల కోసం అద్దెకు ఇస్తున్నారు.



6. కీళ్‌కాడు వీడు



కొబ్బరితోటలు, కాయగూరల తోటల మధ్య, అందమైన కొండల ముందు పెంకుల పైకప్పుతో గాంభీర్యంగా దర్శనమిస్తుంది కీళ్‌కాడు వీడు. పొల్లాచ్చి సేత్తుమడై సమీపంలోని ఈ ఇంటిలోనే 'బొంబాయి', 'నాట్టామై', 'వానత్తైపోలే', 'చిన్న గౌండర్', 'సూర్యవంశం' వంటి సూపర్‌హిట్ మూవీల షూటింగ్ నెలల తరబడి జరిగింది. ఈ సేత్తుమడై ప్రాంతంలోనే ఏవీఎం సంస్థ నిర్మించిన 'సకలకళావల్లవన్' సినిమాలో 'కట్టవండి కట్టవండి' సాంగ్ సీన్స్ తీశారని ఆ ప్రాంతానికి చెందిన మహిళ లక్ష్మీ తెలిపింది. ప్రస్తుతం ఆ ఇంటిలో మలయాళ మూవీ షూటింగ్‌లు ఎక్కువగా జరుగుతున్నాయి.

7. టాప్‌స్లిప్

పొల్లాచ్చి సమీపంలో ఆనమలై పులుల అభయారణ్య ప్రాంతమే టాప్‌స్లిప్. అటవీశాఖ అనుమతితోనే పర్యాటకులు ఆ ప్రాంతాన్ని సందర్శించడానికి వీలవుతుంది. అక్కడ శరత్‌కుమార్ హీరోగా నటించిన 'సూర్యన్' మూవీ షూటింగ్ జరిగింది. హిందీ, మలయాళ మూవీల షూటింగ్‌లు ఎక్కువగా జరుగుతుండేవి. ఇటీవలి కాలంలో మూవీ షూటింగ్‌లకు అటవీశాఖ అధికారులు కఠిన నిబంధనలు అమలు చేస్తున్నారు. ఈ కారణంగా టాప్‌స్లిప్‌లో క్రమంగా మూవీ షూటింగ్‌లు బాగా తగ్గాయి.



ఫిలిమ్‌సిటీ నిర్మించాలి

గతంలో పొల్లాచ్చి, పరిసర ప్రాంతాల్లో ఒకే రోజు ఐదారు మూవీల షూటింగ్‌లు జరిగేవి. వెయ్యిమందికిపై సహాయనటులు, సాంకేతిక సహాయకులు, ట్రావెల్ ఏజెంట్ల రాకపోకలతో కళకళలాడుతుండేది. అందరికీ స్థిరమైన సంపాదన లభించేది. హోటల్ పరిశ్రమలు కూడా బాగా అభివృద్ధి చెందాయని లోకేషన్ మేనేజర్ పొల్లాచ్చి రాజా తెలిపారు. 1990లలో పొల్లాచ్చి పరిసర ప్రాంతాల్లో రోజుకు రెండు మూడు మూవీల షూటింగ్‌లు జరుగుతుండేవని, 2000 సంవత్సరం తర్వాత నగరాల నేపథ్యంతో కూడిన స్టోరీలతోనే మూవీలు రిలీజ్ అయ్యాయని, దీంతో పొల్లాచ్చి తమిళ మూవీల షూటింగ్‌లు పూర్తిగా నిలిచిపోయాయని సినీ కథారచయిత నటుడు ప్రసన్నా బాలచందర్ తెలిపారు. పొల్లాచ్చి, ఉడుమలై, వాల్పారై, ఊటీ, కొడైకెనాల్, గోపిశెట్టి పాళయం, తేని తదితర ప్రాంతాలను కలుపుకుని ప్రభుత్వం లేదా ఏదైనా కార్పొరేట్ సంస్థ 'రామోజీ ఫిలిమ్ సిటీ' మాదిరిగా ఓ ఫిలిమ్‌సిటీని నిర్మిస్తే తమిళ మూవీల ఇండోర్, ఔట్‌డోర్ షూటింగ్‌లన్నీ ఒకే ప్రాంతంలో చేయవచ్చు. ఖర్చులు కూడా బాగా తగ్గుతాయి. వేలాదిమందికి ఉపాధి కూడా లభిస్తుందని, ఆ దిశగా తగుచర్యలు చేపట్టాలని పొల్లాచ్చి రాజా, ప్రసన్నా బాలచందర్ డిమాండ్ చేస్తున్నారు.


పొల్లాచ్చి రాజా, ప్రసన్నా బాలచందర్

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ



శ్రీకాళహస్తి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 28వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం టిక్కెట్ల ద్వారా 177 మంది, రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 1,693, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 2,185 మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,196 మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 716, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 276, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 236, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 103 మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 20,171 అమ్ముడైనట్లు అధికారులు తెలిపారు.

టీటీడీ బర్డ్ ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం

తిరుమల, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): టీటీడీ బర్డ్ ట్రస్టుకు శనివారం రూ.10 లక్షలు విరాళంగా అందాయి. హైదరాబాద్‌కు చెందిన ఏబీఆర్ కేఫ్ అండ్ బేకర్స్ సంస్థ ప్రతినిధులు బాబు రావు , శశాంక్ ఈ విరాళాన్ని హైదరాబాద్‌లో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బోర్డు సభ్యుడు సదాశివరావు కూడా ఉన్నారు.

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 4 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 28 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.3.68 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 67,336

తలనీలాలు సమర్పించినవారు: 25,063



SUNDAY FOCUS



దుగరాజపట్నంతో ముడిపెట్టి అడ్డుకుంటారా?



తిరుపతి జిల్లాకు దుగరాజపట్నం పోర్టు ఉండాలనే గూడూరును తిరుపతిలో ఉంచుతున్నామని చెప్పడం సమంజసం కాదు. దుగరాజపట్నంలో పోర్టు నిర్మాణానికి అవకాశం లేదని 2018లోనే నీతి అయోగ్ తేల్చి చెప్పింది. రాష్ట్ర విభజన హామీ చట్టంలో ఈ అంశం పొందిపరిచినా ముందుకు సాగలేదు. ఇప్పుడు మళ్లీ దాంతో ముడిపెట్టి అడ్డుకోవడం అన్యాయం.

- వి.రాజేంద్రప్రసాద్, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, గూడూరు



నెల్లూరు గాంధీ బొమ్మ సెంటర్

● రగులుకుంటున్న డిమాండ్

గూడూరు బంధం నెల్లూరుతోనే

గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో తిరిగి కలపకుండా అడ్డుకుంటున్న అంశాలేమిటి? అడ్డుకుంటున్న శక్తులు ఎవరు? ఏ కారణాలు ప్రజల బలమైన ఆకాంక్షను కూడా లెక్కచేయడం లేదు? అధికార కూటమికి రాజకీయంగా తీవ్ర నష్టం కలిగించే నిర్ణయమని తెలిసీ ఎందుకు అడుగు ముందుకే వేస్తున్నారు?.. ఇవీ ఇప్పుడు గూడూరు నియోజకవర్గంలోనే కాకుండా, నెల్లూరు జిల్లాలోనూ, తిరుపతి జిల్లాలోనూ ప్రజల్లో మెదులుతున్న ప్రశ్నలు. ఇందుకు సహేతుక కారణాలున్నాయని చెబుతున్న అంశాలను ప్రజలు అసలు నమ్మడం లేదు. రోజురోజుకూ ఈ డిమాండ్ బలం పుంజుకుంటూనే ఉంది. వినతులు, వేడుకోళ్ల దశ దాటి నిరసనల స్థాయికి చేరుకుంది.

- గూడూరు, ఆంధ్రజ్యోతి

నెల్లూరులో ఎందుకు?

నెల్లూరుకు ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. భాష, యాస, ఆహారపు అలవాట్లలో ఈ ప్రత్యేకత కనిపిస్తుంది. తిరుపతి ప్రాంతానికి వీటికీ ఎంతో కొంత తేడాలుంటాయి. పైగా గూడూరు నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి నెల్లూరు జిల్లాలో కొనసాగుతూ వస్తోంది. బంధుబలగాలు, పెళ్లి సంబంధాలు, ఉపాధి పనులు, ఉద్యోగాలు, వ్యాపార సంబంధాలు, చదువులు, వైద్యం.. అన్నీ నెల్లూరుతోనే ముడిపడి ఉంటాయి. పైగా చేరువన ఉండే నెల్లూరును కాదని దూరంగా ఉండే తిరుపతితో అనుబంధం పెంచుకోవడం అంత సులువు కాదు.

లేని, రాని పోర్టు కోసమా?

తిరుపతి జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ చేసిన వ్యాఖ్యతో నిరాశ పెంచింది. తిరుపతి జిల్లాకు కుడా ఒక పోర్టు ఉంటే అభివృద్ధి సమతుల్యలంగా ఉంటుందనేది ప్రభుత్వ భావనని, అందుకే వాకాడు మండలంలోని దుగరాజపట్నం కోసం తిరుపతిలోనే కొనసాగించాలని ప్రభుత్వ పెద్దలు నిర్ణయించినట్లు వివరించారు. దుగరాజపట్నంలో పోర్టు నిర్మాణానికి 15 ఏళ్ల క్రితం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. అప్పటి ఎంపీ చింతామోహన్ పట్టుదల వల్ల రాష్ట్ర విభజన చట్టంలోనూ పొందుపరిచింది. దీంతో 2014లో దుగరాజపట్నంతో పాటు తూపిలిపాళెం, కొండూరుపాళెం, అంజలాపురం, పామంజి, వాగర్రు, శ్రీనివాసపురం గ్రామాల్లో సుమారు 2,700 ఎకరాల భూములను గుర్తించారు. అయినా పోర్టు నిర్మాణానికి ముందడగు పడలేదు. సాంకేతికంగానూ, ఆర్థికంగానూ దుగరాజపట్నంలో పోర్టు నిర్మాణం ప్రయోజనకరం కాదని అప్పట్లోనే నీతి అయోగ్ స్పష్టం చేసింది. దీంతో ఇది అటకెక్కింది. అప్పటి నుంచి నేటి వరకు కుడా కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీ చింతామోహన్ దుగరాజపట్నం పోర్టు కోసం ఆందోళన కార్యక్రమాలు చేపడుతూనే ఉన్నా ఫలితం లేకుండా పోయింది. అయితే సీఎం చంద్రబాబునాయుడు ఈ ఏడాది మే నెలలో దుగరాజపట్నం వద్ద కేంద్ర ప్రభుత్వ సహకారంతో రూ.3,500 కోట్లతో నౌకానిర్మాణ కేంద్రాన్ని, ఓడల మరమ్మతుల యూనిట్‌ను ఏర్పాటు చేయబోతున్నట్టు ప్రకటించారు. అంటే పోర్టు స్థానంలో ఇవి ఏర్పాటు చేస్తారన్నమాట. మరి పోర్టు కోసమే తిరుపతి జిల్లాలో కొనసాగించాలన్న నిర్ణయంలో అర్థమేమిటనే ప్రశ్న ప్రజల నుంచి వస్తోంది.

వైసీపీ పాపం.. కూటమికి నష్టం

జగన్ ప్రభుత్వం నెల్లూరుతో పెనవేసుకున్న బంధాన్ని పుటుక్కున తెంచేసింది. తిరుపతి జిల్లాలో గూడూరు నియోజకవర్గాన్ని భాగం చేసింది. దీనిపై ఆ పార్టీ నాయకులెవరూ నోరు కూడా తెరవలేదు. ఈ నేపథ్యంలోనే ప్రజల ఆకాంక్షను గ్రహించి ఎన్నికలకు ముందు నారా లోకేశ్, చంద్రబాబు ఇద్దరూ గూడూరును తిరిగి నెల్లూరులోనే కలుపుతామని హామీ ఇచ్చారు. వీరి మాటలపై నమ్మకంతో ఉన్న ప్రజలు తాజా నిర్ణయంతో విస్తుపోయారు. గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలోనే విలీనం చేయాలని మంత్రివర్గ ఉపసంఘం ప్రతిపాదించినా, అనంతరం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో ఈ అంశం లేదు. దీంతో ప్రజలు కోపంతో ఉన్నారు.

మీరిచ్చిన హామీలకే విలువ లేదా?



గత ప్రభుత్వం అశాస్త్రీయ పద్ధతిలో గూడూరును తిరుపతి జిల్లాలో కలిపింది. అప్పట్లో ప్రజలు వ్యతిరేకించినా పట్టించుకోలేదు. ప్రజలు ఓట్ల ద్వారా తమ తీర్పును ప్రకటించారు. ఇప్పటి ప్రభుత్వం కూడా అదే దారిలో వ్యవహరిస్తోంది. ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకోవాలి. చంద్రబాబు, లోకేశ్ ఇచ్చిన హామీలకే విలువ లేకపోతే ఎలా? గూడూరును నెల్లూరు జిల్లాలో కలిపేంత వరకు, జేఏసీ ఆధ్వర్యంలో శాంతియుత పోరాటాలు సాగిస్తూనే ఉంటాం.

- బి.దశరథరామిరెడ్డి, జేఏసీ కన్వీనర్, గూడూరు

ఇంత కష్టపెట్టడం అవసరమా?



టీచర్లు శిక్షణా తరగతులు, కౌన్సెలింగ్, స్పాట్ వాల్యూయేషన్‌లకు జిల్లా కార్యాలయాలకు వెళ్లాల్సి ఉంటుంది. గూడూరు నుంచి నెల్లూరుకు 40 కిలోమీటర్లు. తిరుపతికి వెళ్లి రావాలంటే దూరం, కష్టం ఎక్కువ. ప్రజల కోరికను మన్నించి గూడూరును నెల్లూరులోనే ఉండేలా చర్యలు తీసుకోవాలి.

- ఎస్.చిరంజీవి, ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గూడూరు.

మా బంధాలు తెంచేసుకోవాలా?



నాకు ఇద్దరు చెల్లెళ్లు. ఇద్దరికీ నెల్లూరు సంబంధాలే చేసుకున్నాం. నాకు ఇద్దరు కుమారులు. పెద్ద కోడలిది అప్పటి నెల్లూరు జిల్లాలోని సూళ్లూరుపేట. రెండో వాడికి ఇప్పటి నెల్లూరు జిల్లాలోనే సంబంధాలు చూస్తున్నాం. నెల్లూరుతోనే మా సంబంధబాంధవ్యాలన్నీ ఉంటాయి. మమ్మల్ని తీసకపొయ్యి తిరుపతిలో పెడితే ఎట్ట? ఇదేమి న్యాయం?

- జీ.రామచంద్రయ్య, వ్యాపారి, గూడూరు

మా గోడు ప్రభుత్వానికి పట్టదా?



నేను సీజన్ వ్యాపారిని. పదేళ్లుగా గూడూరు నుంచి నెల్లూరుకు రోజూ వెళ్తాను. నెల్లూరు హోల్‌సేల్ షాపుల నుంచి స్టీల్ సామాన్లు తెచ్చి గూడూరులోని దుకాణాలకు అందిస్తుంటాను. గూడూరులో పది స్టీల్ సామాన్లు విక్రయించే దుకాణాలు ఉన్నాయి. ఇదే నా ఉపాధి. నెల్లూరుకు చార్జీల ఖర్చు తక్కువ కాబట్టి వ్యాపారం సాగుతోంది. ఇదే తిరుపతితో చేయగలనా? నా మాదిరే రోజూ నెల్లూరు పొయ్యి వ్యాపారాలు చేసుకునేవాళ్లు గూడూరు ప్రాంతంలో ఎందరో ఉన్నారు. మా గోడు ప్రభుత్వం వినాలి.

- జే.సురేష్‌బాబు, సీజన్ వ్యాపారి, గూడూరు



దుగరాజపట్నం గ్రామం

దివ్యాంగులకు ప్రత్యేక హౌసింగ్ కాలనీ

● విభిన్న ప్రతిభావంతుల దినోత్సవంలో కలెక్టర్ వెంకటేశ్వర్



క్రీడల్లో ప్రతిభచూపిన దివ్యాంగులను సత్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే ఆదిమూలం తదితరులు



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తిరుపతి పరిసర ప్రాంతాల్లో ఉన్న దివ్యాంగులకు ప్రత్యేక హౌసింగ్ కాలనీ ఏర్పాటు చేస్తామని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇంటి వద్దకే పింఛను పంపిస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, కోనేటి ఆదిమూలం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు ఎన్నో పథకాలు అమలు చేస్తోందని, అందులో ఉచిత బస్సు ఒకటి అని అన్నారు. గృహ నిర్మాణాలకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. అంతకు ముందు విభిన్న ప్రతిభావంతులను సన్మానించారు. రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన పురుషోత్తంరెడ్డి, కాంచన, దివ్య, విమల, శివ, కార్తీక్‌లను అభినందించారు. ఈ కార్యక్రమంలో తుడా ఛైర్మన్ దివాకర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు నరసింహయాదవ్, రుద్రకోటి సదాశివం, పసుపులేటి హరిప్రసాద్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారమ్మ, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి విక్రమ్‌కుమార్ రెడ్డి, విభిన్న ప్రతిభావంతుల సంఘం నాయకులు సుబ్రమణ్యం, మురళి, రామచంద్ర పాల్గొన్నారు.

ఆరేళ్ల క్రితం ఫిర్యాదు.. ఇప్పుడు స్పందన

● బాధ్యుల్లో ఇప్పటికే చాలామంది ఉద్యోగ విరమణ ● ఫిర్యాదుదారుడు మృతి

● ఎవరిపై చర్యలు తీసుకోవాలో అర్థంగాక తలలు పట్టుకుంటున్న అధికారులు

డక్కిలి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఆరేళ్ల క్రితం చేసిన ఫిర్యాదుకు అధికారులు ఇప్పుడు స్పందించి చర్యలకు ఆదేశించడం చర్చనీయాంశంగా మారింది. డక్కిలి మండలం పలుగోడు పంచాయతీ పరిధిలోని నాగులపాడు, తిమ్మాయపాళెం, పలుగోడు, హరిజనవాడలో 2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ.30 లక్షలతో సిమెంటు రోడ్లు వేశారు. అయితే ఈ పనులు నాసిరకంగా జరిగాయంటూ పలుగోడుకు చెందిన రుషేంద్రరెడ్డి అప్పట్లోనే విజిలెన్సు అధికారులకు ఫిర్యాదు చేశారు. విజిలెన్సు విభాగం అప్పట్లో విచారణ జరిపి నివేదిక తయారు చేసింది గాని, అది వెలుగులోకి రాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ నివేదికను బయటకు తీసి బాధ్యులపై క్రమశిక్షణ చర్యలకు ఉపక్రమిస్తూ సంబంధిత శాఖలకు నోటీసులు జారీ చేసింది. అయితే ఆ సమయంలో పనులను పర్యవేక్షించిన అధికారులు చాలామంది ఇప్పటికే రిటైర్ అయ్యారు. ఎఫ్ఏసీ ఇన్‌చార్జి ఈఈగా పనిచేసిన రమణయ్య మాత్రమే ప్రస్తుతం నెల్లూరు పీఐయూలో డీఈగా ఉన్నారు. డీఈ, జేఈ వంటి ఇంజనీర్లు ఉద్యోగ విరమణ పొందారు. ఫిర్యాదుదారుడు రుషేంద్రరెడ్డి కూడా చనిపోయారు. దీంతో చర్యలు ఎవరిపై తీసుకోవాలో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

కరూర్ దుర్ఘటనపై
ఇన్‌స్పెక్టర్, వైద్యుడిని విచారించిన సీబీఐ

పెరంబూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కరూర్ దుర్ఘటనపై సీబీఐ అధికారులు ఇన్‌స్పెక్టర్, వైద్యుడిని విచారించారు. కరూర్ వేలుచామిపురంలో గత సెప్టెంబరు 27న జరిగిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షులు విజయ్ ప్రచార సభలో తొక్కిసలాట నెలకొని 41 మంది మృతిచెందారు. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు సీబీఐ అధికారులు విచారణ చేపట్టారు. ఘటన జరిగిన రోజున కరూర్ ప్రభుత్వాసుపత్రికి తిరుచ్చి, దిండుగల్, నామక్కల్ జిల్లాల నుంచి ప్రభుత్వ వైద్యులను రప్పించి మృతులకు పోస్టుమార్టం నిర్వహించారు. ప్రస్తుతం మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించిన ప్రభుత్వ వైద్యులను సీబీఐ అధికారులు విచారిస్తున్నారు. శుక్రవారం పొరుగు జిల్లాలకు చెందిన ముగ్గురు వైద్యులతో పాటు సభకు మైక్ సెట్ ఏర్పాటుచేసిన సంస్థలో పనిచేస్తున్న తిరుపతిని సీబీఐ అధికారులు విచారించారు. అలాగే, శనివారం నామక్కల్‌కు చెందిన ఒక వైద్యుడు, పరమత్తి పోలీసు ఇన్‌స్పెక్టర్ మురుగేశన్‌లను వేర్వేరుగా విచారించారు. ఈ ఘటనకు దారితీసిన పరిస్థితులు, మృతుల గురించిన వివరాలతో కూడిన ప్రశ్నలు అడిగిన అధికారులు, వారు అందజేసిన సమాధానాలను వాంగ్మూలంగా నమోదుచేశారు.

నేడు మదురైలో పెట్టుబడిదారుల సదస్సు

అడయార్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మదురై వేదికగా ఆదివారం పెట్టుబడిదారుల సదస్సు జరుగనుంది. ఇందుకోసం ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శనివారం రాత్రి విమానంలో మదురైకు చేరుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆదివారం ఉదయం వీసీకే నేత మురుగవేల్ రాజా గృహ శుభకార్యంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదిస్తారు. ఆ తర్వాత మదురై మేలమడై జంక్షన్‌లో రూ.150.28 కోట్లతో నిర్మించిన ఫ్లైఓవర్‌ను ప్రారంభిస్తారు. అనంతరం ఉదయం 10 గంటలకు వేలమ్మాళ్ ఆడిటోరియంలో జరిగే ఇన్వెస్టర్ల సదస్సును ఆయన ప్రారంభిస్తారు. ఇందులో అనేక సంస్థలతో ప్రభుత్వం ఒప్పందాలు చేసుకోనుంది. ఆ తర్వాత ఉద్దాండిలో ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగే సంక్షేమ సహాయాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని 1.37 లక్షల మంది లబ్ధిదారులకు సహాయాలను అందజేస్తారు. కాగా, సీఎం మదురై పర్యటన సందర్భంగా పట్టణంలో ఆయన పర్యటించే మార్గాల్లో గట్టి భద్రతను ఏర్పాటు చేశారు.

8న కాంచీపురం ఏకాంబరేశ్వరాలయ
మహాకుంభాభిషేకం

● 149 పాఠశాలలకు సెలవు ● ఘనంగా కలశాల ఊరేగింపు



కలశాల ఊరేగింపులో ఆలయ నిర్వాహకులు, భక్తులు

ప్యారీస్, డిసెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): కాంచీపురంలో ప్రసిద్ధిగాంచిన పురాతన ఏకాంబరేశ్వరర్ ఆలయ మహాకుంభాభిషేకం ఈ నెల 8వ తేదీ నిర్వహించనున్న సందర్భంగా జిల్లాలోని 149 పాఠశాలలకు జిల్లా విద్యాశాఖ ప్రన్సిపల్ అధికారి నళిని సెలవు ప్రకటించారు. ఎలవార్ కుళలి సమేత ఏకాంబనాథర్‌స్వామివారు కొలువుదీరిన ఈ ఆలయంలో రూ.29కోట్లతో చేపట్టిన జీర్ణోద్ధరణ పనులు పూర్తయ్యాయి. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన యాగశాలలో శనివారం ఉదయం నుంచి హోమాలు ప్రారంభమయ్యాయి. దేశంలోని పలు పవిత్ర నదుల నుంచి జలాలు సేకరించిన కలశాలలతో నిర్వహించిన ఊరేగింపులో ఆలయ పూజారులు, నిర్వాహకులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కుంభాభిషేకం సందర్భంగా ఆలయాన్ని అరటి, మామిడి తోరణాలు, విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు.

నకిలీ దస్తావేజులతో
పీఎంకేని హస్తగతం చేసుకోవాలని యత్నం

● అన్బుమణిపై ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు

పెరంబూర్, డిసెంబరు 6 (ఆంధ్ర జ్యోతి): నకిలీ దస్తావేజులతో పార్టీని అన్బుమణి హస్తగతం చేసుకోవాలని యత్నిస్తున్నారని రాందాస్ వర్గీయులు ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పాట్టాలి మక్కల్ కట్చి (పీఎంకే) వ్యవస్థాపకులు రాందాస్, ఆయన కుమారుడు అన్బుమణి రాందాస్ మధ్య తీవ్రమైన పార్టీ విభేదాలు చోటుచేసుకున్నాయి. నకిలీ దస్తావేజులు ఎన్నికల కమిషన్‌కు సమర్పించారంటూ రాందాస్ దాఖలుచేసిన పిటిషన్ ఢిల్లీ హైకోర్టులో ఇటీవల విచారణకు వచ్చింది. ఈ పిటిషన్‌ను విచారించిన న్యాయమూర్తి జస్టిస్ మిని పుష్కర్ణ, అంగీకారం పొందని పార్టీ వ్యవహారాల్లో ఎన్నికల కమిషన్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని సూచించి, పిటిషన్ విచారణ ముగిసినట్లు ప్రకటించారు. అదే సమయంలో, ఇలాంటి వివాదాలు కొనసాగితే 'మామిడి పండు' చిహ్నం కూడా స్తంభింపజేస్తామని ఎన్నికల కమిషన్ హెచ్చరించింది. ఈ క్రమంలో, రాందాస్ తరఫున ఆయన మద్దతుదారుడు జీకే మణి ఢిల్లీ పార్లమెంటు వీధిలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులో.. పీఎంకే సర్వసభ్య మండలి సమావేశం నిర్ణయించినట్లు నకిలీ దస్తావేజులు ఎన్నికల కమిషన్‌కు సమర్పించారని పేర్కొన్నారు. ఈ కారణంగా అన్బుమణిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆయన ఫిర్యాదులో కోరారు.

రైతు సంఘ నేతకు
13ఏళ్ల జైలు



బీఆర్ పాండ్యన్

ప్యారీస్, డిసెంబర్ 6 (ఆంధ్ర జ్యోతి): తమిళనాడు రైతు సంఘాల సమాఖ్య ఆర్గనైజింగ్ కమిటీ అధ్యక్షుడు బీఆర్ పాండ్యన్‌కు 13ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ తిరువారూర్ కోర్టు శనివారం తీర్పువెలువరించింది. తిరువారూర్ జిల్లా విక్రపాండియం ప్రాంతంలో గత 2015లో కేంద్ర ప్రభుత్వ నిర్వహణలోని ఓఎన్‌జీసీ సంస్థ బోరుబావులు తవ్వి ఆయిల్‌ను సేకరించే పనులను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ రైతులతో కలిసి నిర్వహించిన ఆందోళనలో ప్రజల ఆస్తులను ధ్వంసం చేశారని బీఆర్ పాండ్యన్‌పై పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించిన విచారణ పూర్తయిన నేపథ్యంలో, శనివారం బీఆర్ పాండ్యన్‌కు 13ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ తిరువారూర్ న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేసింది.

ఆలూరి రామస్వామిపూర్ణావతి ట్రస్టు
ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

చెన్నై, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రారంభమైన 'ఆలూరి రామస్వామి పూర్ణావతి తెలుగు చారిటబుల్ ట్రస్టు' కూచిపూడి అకాడమీ సిబ్బందికి ఆర్థిక సాయం అందించింది. అకాడమీ సిబ్బంది శ్రీమోయికి శనివారం రూ.20 వేలు ఆర్థిక సాయం అందించినట్లు ట్రస్టు వ్యవస్థాపకురాలు డాక్టర్ ఏవీ శివకుమారి విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.